# వైయస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 10 ఆగస్టు 2023


## కలకలం రేపుతున్న ఫేక్ చెక్

**కొండాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

కొండాపురం బ్యాంకు అధికారులను మోసగించాలని చేసిన ప్రయత్నం విఫలమైందనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొండాపురం భారతీయ స్టేట్ బ్యాంకు నందు మంగళవారం బ్యాంకు అధికారులను మోసగించి కోట్ల రూపాయలు దండుకోవాలని ఒక ముఠా వేసిన పథకం బ్యాంకు అధికారుల అప్రమత్తతతో విఫలమైంది. కొండాపురం మండలానికి చెందిన ఒక ప్రముఖుడు మంగళవారం మధ్యాహ్నా భోజన విరామ సమయానికి ముందుగా వచ్చాడు. తనకు ఒక వ్యక్తి రూ.2కోట్లు ఇవ్వాలని, అందుకు ఈ చెక్కులను ఇచ్చాడని సంతకంతో కూడిన చెక్కును అధికారులకు ఇచ్చినట్లు తెలిసింది. మధ్యాహ్నాం భోజన విరామ సమయానికి ముందుగా అధికారులు హుడావుడిలో ఉంటారని తెలుసుకున్న వ్యక్తి బ్యాంకు నందు బ్లాంకెట్ ఎక్ రూపాయల విలువ వ్రాయండి.. కేవలం సంతకంతో కూడిన చెక్కును తెచ్చి తన అకౌంట్‌కు జమ చేయాల్సిందిగా అధికారులకు ఇచ్చాడు. కొండాపురం బ్యాంకు కెపాసిటీని మించిన మొత్తం కలిగిన చెక్కు రావడంతో అనుమానం వచ్చిన అధికారులు వెంటనే పూర్తి ఆరా తీశారు. ఫేక్ చెక్కు అని గమనించిన అధికారులు ఈ విషయం ఖాతాదారులకు తెలియకుండా జాగ్రత్తపడ్డారు. ఎట్టకేలకు ఈ విషయం బయటకు రావడంతో కలకలం రేగింది. వెంటనే కొండాపురం పోలీసులు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నారు. అధికారులు అప్రమత్తంగా లేకపోయి ఉన్నట్లైతే అధికారుల ఉద్యోగాలు పోవడమే కాకుండా కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం మోసగాడి పాలయ్యేది. నకిలీ చెక్కులు ఫోర్జరీ సంతకాల ముఠా గుట్టు రట్టు అయ్యేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



**ఖాజీపేట ఆగస్టు 9, ప్రభాతవార్త**

ఖాజీపేట మండలం ముత్తులూరుపాడు గ్రామానికి చెందిన ఎల్లుగారి నర్సింహులు వయసు (38) అనే వ్యక్తి ఖాజీపేట మండలం భూమాయపల్లె వద్ద గల బ్రిడ్జి కింద మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మ హత్య ప్రయత్నం చేసుకున్నాడని ఇతనికి భార్య, ఐదు మంది పిల్లలు వున్నారని మద్యానికి బానిసయ్యి రోజు డబ్బులు ఇవ్వమని భార్యను వేధిస్తుండేవాడని త్రాగడానికి డబ్బులు ఇవ్వకుంటే చనిపోతానని తరచు భార్యను వేదిస్తు ఉండేవాడని గతంలో కూడా సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు గ్రామస్థులు తెలి పారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఖాజీపేట ఎస్సై రాజరాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

# మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు,

## టిడిపి ముఖ్యనేతలపై కేసు నమోదు : ఎస్పీ గంగాధర్ రావు

**రాయచోటి, ఆగస్టు 9 ప్రభాతవార్త :**

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అలాగే టిడిపి ముఖ్య నాయకులు 20 మందిపై కేసు నమోదు చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన మదనపల్లెల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ చూసేందుకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుమతి పొందినప్పటికీ ఆకస్మాత్తుగా ప్లాన్ మార్చుకొని మొలకల చెరువు అంగళ్ళ మీదుగా చితత్తూరు జిల్లాలోకి వెళ్ళేందుకు ప్రయత్నించారని ఎస్పీ తెలిపారు. నాయనవారి చెరువు వద్ద అక్కడి ఎమ్మెల్యేని కించపరిచేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేశారన్నారు. ముదివేడు పరిధిలోని పిచ్చలవాండ్లపల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకోవద్దని పనులు 90 శాతం పూర్తయ్యాయని చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు అంగళ్లలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉమాపతి రెడ్డి 40 మంది వైకాపా కార్యకర్తలతో రోడ్డుపైకి వచ్చారన్నారు. ముందస్తు ప్రణాళికతో భారీగా చేరుకున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వారిపై రాళ్ల కర్రలు, చెప్పులు, కొడవళ్ళు, రాడ్లు ఇతర ఆయుధాలతో దాడి చేసి తరిమికొట్టి గాయపరిచారని ఎస్పీ తెలిపారు. అంతే కాకుండా చంద్రబాబు నాయుడు కొట్టండి తట్టండి తరమండి వేసేయండి అంటూ కార్యకర్తలను ఉసిగొలిపాడని ఈ దాడిలో వైకాపాకు చెందిన అర్జున్ రెడ్డి, మహేష్, చంద్రశేఖర్, శ్రీనివాసులుతో పాటు మరో రైతు గాయపడినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సంఘటన నేపథ్యంలో కురబలకోట మండలం దాదంవారిపల్లెకి చెందిన బి.ఆర్.ఉమాపతి రెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు ముదివేడు పోలీసు స్టేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మాజీ మంత్రి దేవినేని ఉమా, అమర్నాథ్‌రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, షాజహాన్ బాష, దొమ్మల పాటి రమేష్, కిషోర్ కుమార్ రెడ్డి, గంటా నరహరి, శ్రీరామ్ చినబాబు, శ్రీధర్ వర్మ, ఆర్.శ్రీనివాసుల రెడ్డి, పులపర్తి నాని, ఎం. రాంప్రసాద్ రెడ్డి, ఖాదర్ ఖాన్, వై.సి. రమణ, వైజి సురేంద్ర, రాచకొండ మధుబాబు, పర్వీన్ తాజ్, ఏలగిరి దొరస్వామి నాయుడు, నారాయణస్వామి రెడ్డితో పాటు మరి కొందరిపై క్రైమ్ నెంబర్ 79/2023, 120బి 147, 145, 153, 307, 115, 109, 323,324, 506 ఆర్/డబ్ల్యు. 149 ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ గంగాధర్‌రావు తెలిపారు. ఈ కేసును ముదివేడు ఎస్.ఐ. షేక్ మోబిన్ తాజ్ విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.




## వర ప్రసాదినిలా వైఎస్ఆర్ వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

### కుడికాలువకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

**గాలివీడు, ఆగస్టు 9 ప్రభాతవార్త :**

ప్రజలకు, రైతులకు త్రాగునీరు, సాగునీరు అందించే వర ప్రసాదినిలా వైఎస్ఆర్ వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మారిందని వైఎస్ఆర్ సిపి రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుదవారం ఆయన వెలుగల్లు కుడి కాలువకు నీటిని అధికారులతో కలసి విడుదల చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా దేవుడు దయతో సకాలంలో వర్షాలు కురవడంతో కాలువల ద్వారా నీరు విడుదల చేసే అవసరం రాలేదు, ఈ సంవత్సరం వర్షాలు కొంచెం ఆలస్యం కావడంతో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే సంకల్పంతో కుడి కాలువలో ఏర్పడ్డ పూడికలు, చిన్న చిన్న మరమ్మతులను ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతులను పూర్తి చేయించామన్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసే సమయంలో సకాలంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ముందు చూపు ఆలోచనతో బుధవారం స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులుతో కలసి కుడికాలువకు నీటిని విడుదల చేశామన్నారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాలలోని కుంటలు, చెరువులు జలకళను సంతరించుకోనున్నాయి. వెలిగల్లు రిజర్వాయర్‌ను వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయిన వెంటనే మూడేళ్ళలోనే పూర్తి చేసి జాతికి అంకితం చేశారన్నారు. ఎడమ కాలువకు కూడా మరమ్మత్తు పనులు చేయించి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఇచ్చినమాట ప్రకారం మిట్ట గామాలలోని చెరువులుకు కూడా నీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్టపల్లె, యదుభూషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషన్ రెడ్డి,సింగల్ విండో అధ్యక్షుడు వేదమూర్తి రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి అమరనాధ రెడ్డి, సర్పంచులు, యం పి టి సి లు, వైఎస్ఆర్‌సిపి యూత్ లీడర్ వెంకట రమణారెడ్డి, నాయకులు వేణు గోపాల్ ,మనోహర్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, సుబ్బారెడ్డి, బ్రంహానంద రెడ్డి,గంగాధర్ నాయుడు,పరశురామ్,వేంకటాద్రి, వినోద్ ,అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అంతర్రాష్ట దొంగల ముఠా అరెస్ట్

### - బంగారు, వెండి స్వాధీనం



**పోరుమామిళ్ళ, ఆగస్టు 09ప్రభాతవార్త:**

ఇటీవల పోరుమామిళ్ళ పట్టణంలో జరిగిన బంగారు చోరీ కేసును పోలీసులు చేదించారు. నలుగురు దొంగలను అదుపులోకి తీసుకొని వారి నుండి 9 తులాలు బంగారు, కేజి వెంటిని పోరుమామిళ్ళ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డిఎస్పీ వంశీధర్ గౌడ్, సిఐ సురేష్‌లు తెలిపారు. పోరుమామిళ్ళ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం డిఎస్పీ వంశీధర్ గౌడ్ మాట్లాడుతూ పోరుమామిళ్ళ పరిసర ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. నలుగురు దొంగలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బుధవారం బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నెపల్లె గ్రామ సమీపంలో అనుమానస్పదంగా ద్విచక్ర వాహనంలో పట్టుబడ్డారని నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. నలుగురి నింధితులపై ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో కరుడుగట్టిన నేరాలు చేసే నిందితులని కేసులు నమోదయ్యాయని తెలిపారు.

## ఆదివాసీలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

### ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఉపముఖ్యమంత్రి అంజాద్ భాష

**కడప, ఆగస్టు 9 ప్రభాతవార్త :**

ఆదివాసీలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష అన్నారు. బుధవారం స్థానిక నగరంలోని ఎస్టీ గురుకుల్ స్కూల్లో ఆల్ ఇండియా బంజారా సేవ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపముఖ్యమంత్రి అంజాద్ భాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆగస్టు 9వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఒకప్పుడు ఆదివాసీలు అంటే కొండ ప్రాంతంలో మాత్రమే నివసించే వారిని ప్రస్తుతం వారు ఆధునిక సమాజంలో భాగస్వాములు చేయడానికి ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హక్కుల కోసం ఎన్నో చట్టాలు తీసుకురావడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మన రాష్ట్రంలో విద్య వైద్య వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ అనేక విప్లమాత్మక మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ ఆదివాసీలకు ఉన్నత చదువులు అందిస్తూ డాక్టర్, ఇంజనీరింగ్‌లుగా మార్చడానికి ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ఆదివాసి పిల్లలు చదువులు మధ్యలో నిలిపివేయకుండా బాగా చదువుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే ఆదివాసీల్లో జరుగుతున్న బాల్యవివాహాలను అరికట్టాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పిల్లలను బడికి పంపితే చాలు తల్లి అకౌంట్లో రూ 15 వేలు జమ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రేషన్ వారి ఇంటి దగ్గరికి అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ ప్రభుత్వంలో అత్యధికంగా ఏడు మంది ఎస్టీ శాసనసభ్యులు ఉన్నారని అలాగే ఒక ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన రాజన్న దొరకు ఉపముఖ్యమంత్రిని చేసిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆదివాసీలకు అన్ని విధాలుగా ప్రభుత్వం రాబోవు కాలంలో మరింత చేదోడుగా ఉంటుందని నగరంలో ఆదివాసీలకు పర్మనెంట్ స్కూలు నిర్మించడంలో నా శక్తుల కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ జగన్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర నాయక్, వైఎస్సార్సీపీ వైద్య విభాగ అధ్యక్షులు శివ నాయక్, వైఎస్సార్సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ నాయక్, గురుకుల్ స్కూల్ ప్రిన్సిపల్ విజయలక్షి, ఎస్టీ కార్పొరేషన్, డిస్టిక్ ట్రైబెల్ వెల్ఫేర్ డా.వెంకటసుబ్బయ్య, నగర వైయస్సార్సీపి నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, మార్కెట్ చైర్మన్ బంగారు నాగయ్య, పూసల భలిజ స్టేట్ డైరెక్టర్ విజయకుమారి, ఎస్టీసెల్ నగర అధ్యక్షులు రమణ ఎస్టీసెల్, నగర కార్యదర్శి కృష్ణ నాయక్,తదితరులు పాల్గొన్నారు.



## పండుగ వాతావరణంలో నాభూమి - నా దేశం కార్యక్రమం

### - అందరం కలిసికట్టుగా దేశ అబివృద్ధికి భాగస్వాములు అవుతాం

### - జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్

**చిన్నమండెం, ఆగస్టు 09ప్రభాతవార్త:**

అందరం కలిసికట్టుగా దేశ అభివృద్ధికి భాగస్వాములు అవుదామని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ తెలిపారు. బుధవారం అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం, కేశాపురంలో నా భూమి - నాదేశం నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, జెసి ఫర్మన్ అహ్మద్‌ఖాన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండుగ వాతావరణంలో నాభూమి - నాదేశం కార్యక్రమం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉదన్నారు. జీవితంలోనరి ప్రతిరోజు, ప్రతిక్షణం, శరీంలోని ప్రతి అణువు మాతృభూమి కోసం జీవించడమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం అర్పించే నిజ నివాళి అని దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి పిలుపునిచ్చారన్నారు. స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను భావితరాలకు అందిద్దాం. పడమి తల్లిని కాపాడుదామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇంకా 25 సంవత్సరాలకు వంద సంవత్సరాలు అవుతుంది. రాబోయే 25 సంవత్సరాలు భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్పు తీసుకురావడానికి కృషి చేయాలని దేశ ప్రధాని నరేంద్ర మోడి ఆకాంక్షించారన్నారు. ఆ దిశగా మనమందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.



**మేరీ మాటి మేరా దేశ్ ప్రతిజ్ఞ :**

భారత్‌ను అభివృద్ధి చెందిన, స్వావలంబన కల్గిన దేశంగా 2047 లోపల చేదా ం.. మన వారసత్వ సంపద గొప్పతనాన్ని చాటుదాం. మన ఐకమత్యాన్ని బలోపేతం చేసుకుని మన దేశ రక్షకులను గౌరవిద్దాం. పౌరుల మధ్య విధుల పట్ల అవగాహన కలిగిద్దామని మేరీ మాటి మేరా దేశ్ ప్రతిజ్ఞ గావించారు. అంతకు ముందు నాభూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను జిల్లా కలెక్టర్ ఎగరవేశారు. అనంతరం మొక్కలు నాటి నీళ్ల పోశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడి మద్దిలేటి, ఐసిడిఎస్ పీడి ధనలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**వీరబల్లి ఆగస్టు 9, ప్రభాతవార్త**



మండలంలోని, వంగిమళ్ళ గ్రామం, వనంకాడపల్లి వద్ద రోడ్డుపై వెళుతున్న ఆలినవజ్ ఖాన్ వ్యక్తిని అతి వేగం గా వి.అర్ స్కూల్ బస్సు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుటాహుటిన రాయచోటికి తరలించారు. అప్పటికే క్షతగాత్రుడు మృతి చెందాడని ధృవీకరించిన వైద్యులు. డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా బస్సు ఢీకొనడంతో మృతి చెందిన అలినవాజ్ ఖాన్. మృతుడు రోజు కూలీ పనిచేసి తన కుటుం బాన్ని పోషించుకునేవాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.

## నాడు- నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



**పీలేరు, ఆగస్టు 9 ప్రభాతవార్తః**

నాడు-నేడు రెండో విడత పనులు వేగవంతంగా పూర్తిచేయాలని డీఈఓ ఎస్. పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధ వారం పట్టణంలోని శ్రీభువన విద్యాలయంలో పీలేరు నియోజకవర్గం ఎంఈఓలకు, హెచ్ఎంలకు నాడు-నేడు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో రెండో విడత 349 కోట్ల రూపాయలతో 1017 ప్రభుత్వ పాఠశాలలు, 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల పనులు జరుగుతున్నాయని, ఇప్పటి వరకు రూ.116 కోట్లు మంజూరు కాగా రూ.106 కోట్లు నిర్మాణాలకు ఖర్చు చేశామన్నారు. జిల్లాలో నాడు-నేడు పనులు 70 శాతం పూర్తైయ్యాయన్నారు.మిగిలినవి వందశాతం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవైఈఓ ఆనందరెడ్డి, సీఎంఓ కరుణాకర్, ఏఎస్ఎల్ఓ కోఆర్డి నేటర్ చంద్రశేఖర్‌నాయక్, ఎంఈఓలు లేకేశ్వరరెడ్డి, పద్మావతి, కరీముల్లా, వెంకటలక్ష్మి, మునిచంద్ర, సుబ్రమణ్యం, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

## ఓటర్ల వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయండి

మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి


IVలో


## విద్యార్థుల నడ్డి విరుస్తున్నారు..!

### చట్టం అంటే లెక్కలేని తనమా...!!

**రాయచోటి, ఆగస్టు 9 ప్రభాతవార్త :**

పాఠశాలల్లో పిల్లల బ్యాగ్ ఎంత పెద్దగా ఉంటే అంత బాగా చదువు తున్నట్లు అన్నమాట తల్లిదండ్రుల కలల్ని నెరవేర్చాలంటే ఆ మాత్రం పుస్తకాల లేకపోతే ఎలా పైగా ఇతరుల ముందు నామోషి కదా అని తల్లిదండ్రులు భావిస్తుంటే వసూలు చేస్తున్న ఫీజులకు ఆమాత్రం పుస్తకాలు ఉంటేనే చదువు చెబుతున్నామన్న ఫీలింగ్ తల్లిదండ్రులకు కలుగుతుందన్న ఆలోచనలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఉన్నాయి అనటంలో సందేహం లేదు బుడిబుడి అడుగుల బుజ్జాయిలు ఆటపాటలతో చదువుకోవాల్సిన వయసులో బండెడు పుస్తకాలు మోయలేక నానా తంటాలు పడుతున్నారు. దీంతో చదువులు పెను భారంగా పరిణమిస్తూ తలకు మించిన భారంగా మారుతున్నాయి. కేజీలకు కేజీలు ఉన్న పుస్తకాలు ఈపుకు తగిలించుకొని హుషారుగా ఇంటి నుంచి బయలుదేరినప్పటికీ నడవలేక నడుస్తూ పాఠశాల మెట్లు ఎక్కలేక ఎక్కుతూ పయనమైన విద్యార్థులు సాయంత్రానికి నీరసంగా తిరిగి వస్తుంటే చూసి జాలి పడాలో లేక వారి కోసమే కదా అంటూ సర్దుకుపోవాలో అర్థం కాని పరిస్థితిలో నేటి తల్లిదండ్రులు ఉన్నారు. పుస్తకాల బరువులు ఏటేటా పెరుగుతున్నప్పటికీ వాటి నియంత్రణకు అటు అధికారులు కానీ విద్యార్థి సంఘాలు గాని పట్టించుకున్న దాఖలాలు లేవని చెప్పాలి చిన్న పిల్లలు అధిక బరువులు మోయకూడదని ప్రభుత్వ నియమ నిబంధనలు తెలియజేస్తున్నప్పటికీ వాటిని కార్పొరేట్ విద్యాసంస్థలు బుట్ట దాఖలు చేస్తున్నాయి అయినప్పటికీ వారిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్ర విమర్శలకు తావిస్తోంది ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి పసివాళ్ళ పాలిట పెనుబారంగా మారిన పుస్తకాల మోతను తగ్గించాలని తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నేతలు ఉపాధ్యాయులను కోరుతున్నారు.

**యాజమాన్యాల జోరు తల్లిదండ్రుల బేజారు**

విద్యా సంవత్సరం ప్రారంభమైందంటే విద్యార్థుల తల్లిదండ్రులలో ఆందోళన రేకెత్తుతుంది ఎందుకంటే ఫీజులతోనే సతమతమవుతుంటే వేలాది రూపాయలతో పుస్తకాలు నోట్ పుస్తకాలు యూనిఫాంలు కొనుగోలు చేయలేక సగటు మానవుడు ఇబ్బందులకు గురవుతున్నాడు బడిగంట మ్రోగేవేళ వారిలో భయాందోళన మొదలవుతున్నాయి గొప్పలకు పోయి అప్పుల పాలై చివరకు చేసేదిలేక మధ్యలోనే పాఠశాల మాన్పించడం లేక ఉపకార వేతనాలు అంటూ అసోసియేషన్ల చుట్టూ తిరగడం నిత్యం దర్శనమిస్తున్న సంఘటనలే అయినప్పటికీ ఎంతో ప్రతిభాపాటవాలు కనబరుస్తూ అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు మాత్రం నామోషిగానే భావిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే కార్పొరేట్ సంస్థలకు ధీటుగానే ప్రభుత్వ పాఠశాల ఉత్తీర్ణత శాతం సాధిస్తున్నాయి అదేవిధంగా తగినంత ఆటస్థలం యోగ ప్రత్యేక ప్రభుత్వ శిక్షణ పొంది నాణ్యత ప్రమాణాలతో విద్యాబోధన చేసి ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలకే సొంతం అంతలా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం పటిష్ట పరుస్తుంటే మారాల్సిన తల్లిదండ్రులు దూరపు కొండలు నునుపు అనే చందంగా ఆలోచనలు చేయడం సిగ్గుచేటని విద్యావేత్తలు భావిస్తున్నారు

**అనవసర పుస్తకాలే ఎక్కువ :**

ప్రైవేటు పాఠశాలల్లో అనవసరమైన పుస్తకాలు ఎక్కువగానే ఉంటున్నాయి ఒకటవ తరగతి చదివే విద్యార్థికి సుమారు 35 పుస్తకాల వరకు ఉంటున్నాయి ఇవి కాకుండా వాటర్ బాటిల్ క్యారేజ్ బాక్స్‌లు అంటూ తదితర బరువులు కలుస్తున్నాయి ఇక హయ్యర్ స్టడీస్ విద్యార్థులు సంగతి చెప్పనవసరం లేదు బ్యాగ్ నిండా ఇంటి నిండా పుస్తకాలు ఉంటాయి. తిరిగి పాఠశాలలోనూ వీరికి సంబంధించిన పుస్తకాలు ఉంటాయి ఇక చదివేది ఎప్పుడో చూసే వారికి అర్థం కాదు కానీ తల్లిదండ్రులు మాత్రం సంబరపడిపోతుంటారు.



## పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలు : ఎమ్మెల్యే

**రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త**

రైల్వేకోడూరు నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని రైల్వే కోడూరు మండలంలోని మైసూరువారిపల్లె, రాజీవ్ నగర్, శాంతినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌నగర్‌లోకి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయిలు రావడంతో గ్రామానికి చెందిన మహిళలు, దళిత ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని సేవలను, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నా రని, గ్రామీణ ప్రాంతాల్లో వైసిపి ప్రభుత్వంపై ఆదరణ మరువరానిదని కొనియాడారు. భవిష్యత్తులో అన్నిపార్టీలు ఏకమై వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తిరుగులేని మెజారిటి లభిస్తుందని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ జాషువా, ఎపిఓ ఉమామహే శ్వర్‌రావు, ఆర్‌డబ్లు ఎస్ అధికారి రమేష్, ఇతర మండల అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## మితిమీరుతోన్న విద్యుత్ వైరు దొంగలు

### అవస్థల్లో రైతులు

**రామాపురం ఆగస్టు 9, ప్రభాతవార్త**

మండలంలో వ్యవసాయ బోర్లు, మోటారు వైరు దొంగలు ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. దీంతో వ్యవసాయ రైతులు తీవ్ర ఇబ్బం దికి గురవుతున్నారు. మండలంలోని శుద్ధ మల్ల పంచాయతీ ఓబుల్ రెడ్డి గారి పల్లె కు చెందిన గంగిరెడ్డి వెంకటనారాయణ రెడ్డి ప్రసాద్ రెడ్డి మోహన్ రెడ్డి వెంకట్రామిరెడ్డి లకు సంబంధించిన రైతుల వ్యవసాయ బోర్ల వైర్లను వ్యవ సాయ భూముల వద్ద ఉన్న వ్యవసాయ పనిముట్ల కోసం నిర్మించుకున్న భవనా లకు తాళాలు, కిటికీలు పగలగొట్టి అందులో ఉన్న వ్యవసాయ పని ముట్లు విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. గతంలో ఇలాగే రైతు ల బోరు బావులు దగ్గర కాకుండా ఓబుల్ రెడ్డిగారి పల్లి గ్రామానికి త్రాగునీరు సరఫరా చేసే బోరుకు సంబంధించిన విద్యుత్ వైర్లు దొంగలిం చారు. గత రెండు సంవత్సరాల నుండి ఇలానే దొంగతనాలు జరుగుతున్న ఇప్పటివరకు పోలీసులు వీటిపై దృష్టి పెట్టక పోవడంతో తరచూ దొంగతనాలు జరుగు తు న్నాయని పలు గ్రామాల ప్రజలు రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఓబుల్ రెడ్డి గారి పల్లెకు చెందిన రైతులు ఆర్ గంగిరెడ్డి, యువ చంద్ర రెడ్డి, ఎం ఎల్ వెంకటరామిరెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, ఎస్ ప్రసాద్ రెడ్డి ల కు సంబంధించి రైతులు వ్యవసాయ విద్యుత్ బోర్లకు విద్యుత్ వైర్లు, వ్యవసాయ పనిముట్లును మంగళవారం రాత్రి దొంగలించినట్లు గురువారం రామాపురం ఎస్ఐ కొండారెడ్డికి ఫిర్యాదు చేశారు. దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎస్సై ను కోరినట్లు వారు తెలిపారు.



## నా భూమి - నాదేశం కార్యక్రమం విజయవంతం

కలికిరి, ఆగస్టు 9, ప్రభాతవార్త:



మండలంలోని పల్లవోలు పంచాయతీలో బుధవారం స్థానిక సర్పంచ్ బీబీ ఆయేషా అధ్యక్షతన జరిగిన నాభూమి, నాదేశం కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో గంగయ్య ముఖ్య అతిథిగా హాజరై నా భూమి నాదేశం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సచివాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ఆయనను ఆదర్శంగా తీసుకొని గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రెడ్డిప్రసాద్, ఏపీవో సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్, వైసీపీ నాయకులు ఇస్తిక్ అహ్మద్, మండల రీసోర్స్ పర్సన్ శంకర్, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద 12న జరిగే ధర్నాను విజయవంతం చేయండి

### ఎస్‌టియు రీజియన్ కన్వీనర్ నరేష్

మైదుకూరు ఆగస్టు 9, ప్రభాతవార్త



మైదుకూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం జరి గిన సర్వ సన్నాహక సమావేశం ఎస్టియు రీజినల్ కన్వీనర్ బి.కె నరేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఎస్టీయూ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు కడప జిల్లా ఎఫ్ఏపిటివో ఆర్థిక కార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వము గతంలో ఇచ్చిన హామీ ప్రకారము సిపిఎస్ ను వెంటనే రద్దుచేసి ఓపిఎస్.ను అమలు చేయాలని, జీవో నెంబర్ 117ను రద్దు చేసి విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరారు. పిఆర్సి కమిటీతోపాటు ఐ.ఆర్‌ను 50శాతం ప్రకటించాలని, మోరాయిస్తున్న యాప్‌లను సక్రమంగా పనిచేసేట్లు చూడా లని వీటి భారాన్ని తగ్గించి ఉపాధ్యాయులను బోధనలకే పరిమితం చేయాలని, బదిలీ, ప్రమోషన్ల మీద వెళ్లిన ఉపాధ్యాయులకు 2నెలల నుండి రావలసిన బకాయి జీతాలను వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయుల సరెండర్ లీవ్ బకాయిలను 800 కోట్లను రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేయాలని, ఇలాంటి అనేక సమస్యల పైన ఈనెల 12వ తేదీ కడప కలెక్టరేట్ దగ్గర ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 9 గంటల వరకు 12 గంటల పాటు జరిగే ధర్నా కార్య క్రమానికి ఉపాధ్యాయులంతా పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు కె.వి.రాజు, ఆర్థిక కార్యదర్శి ఈశ్వ రయ్య, సీనియర్ ఎస్టియు నాయకులు రాధా నరసింహారాజు, రాజకుమార్, మనో హర్, ఆబిద్ అలీ, నాగరాజు, నారాయణ ప్రసాద్, భగవాన్, విజయ్, సుబ్బారావు, రాజేష్ కుమార్, రామచంద్రుడు, ప్రతాపరెడ్డి, ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఫక్రుద్దీన్ సుబ్బారావు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

ఓబులవారిపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించి విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని విద్యావేత్తలు ప్రజా సంఘాల నాయకులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల నెలకొల్పి విద్యాభ్యాసం పేరుతో ఖర్చు చేస్తూ ఉంటే అవగాహన లేక తల్లిదండ్రులకు విద్య పట్ల మక్కు లేక అమాయకత్వంతో వారిని బడికి పంపించలేకపోవడంతో బడిఈడు పిల్లలు బడి బయట మేకలు, పశువులు కాస్తూ, బాల కార్మికులుగా జీవనం దుర్భరంగాను గడుపుతున్నారంటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి వి.పురం, కొత్తపల్లి గాజల పెద్దఓరంపాడు, వెంకటేశ్వర కాలనీ, చిన్న ఓరంపాడు, చిన్నంపల్లి, ఎన్టీ కాలనీ తదితర పంచాయతీలో మనకు తెలియకుండానే బడిఈడు పిల్లలు బడి బయట ఉండడంతో విద్యాభ్యాసానికి నోచుకోక నిరక్షరాస్యులుగాని సంవత్సరాల కొద్ది ఉన్నారని అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని పలువురు అదికారులను కోరుతున్నారు.

## వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 9, ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హాస్టల్స్‌లో గురుకులాల్లో, కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బీసీ వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వల్లూరు వీరబ్రహ్మంకు పీడీఎస్‌యూ నాయకులు విన్నవిం చారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహంలో చదువుతున్న విద్యార్థుల కోసం పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని, ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు రాకపోవడంతో వసతి గృహ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లాలో వసతి గృహ అధికారులు స్థానికంగా ఉండ డం లేదని, వసతి గృహాల విద్యార్థినిలకు రక్షణ కల్పించే దానికై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయ కుడు స్వరూప్ తేజ, పీడీఎస్‌యూ నగర సహాయ కార్యదర్శి శ్రీనాథ్ పాల్గొన్నారు.

## పంటకోత ప్రయోగాలపై శిక్షణ

జమ్మలమడుగు, ఆగస్టు 9, ప్రభాతవార్త:



ముద్దనూరు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో పంటకోత ప్రయోగాలకు సంబంధించి మండల స్థాయి శిక్షణ సమావేశాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు నిర్వహించే సమయంలో రైతుల సమక్షంలో పొలాన్ని ఎంపిక చేసి తదుపరి ఫారం-1 వివరాలను అధికారులకు పంపించాలని అలాగే పంట కోత నిర్వహించే సమయంలో పర్యవేక్షణాధికారి ఒకరోజు ముందుగానే తెలియజేసి పంట కోత ప్రయోగంలో పాల్గొనేలా చూడాలని సిబ్బందికి తెలిపారు.

## కేవి.పల్లెలో వసుధకు వందనం -వీరులకు వందనం

కేవిపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్తః



మండలంలోని వగళ్ల పంచాయతీ సచివాలయంలో బుధవారం వసుదకు వందనం, వీరులకు వందనం కార క్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర భంగా సచివాలయం వద్ద అమరవీరుల స్మారక చిహ్నా లు ఏర్పాటు చేశారు. చెట్లునాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉపేంద్ర రెడ్డి మాట్లాడుతూ మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవ త్సరాలు సిద్దించిన సందర్భంగా ఈఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాను సారం అని గ్రామ సచివాలయాలలో ఈనెల 14వ తేదీ వరకు నాభూమి నాదే శం అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా కేవి.పల్లె అధికారులు ప్రజా ప్రతినిధులు అమరవీరులకు వందనం తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జడ్పీటీసీ గజ్జల శ్రుతి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యల్లయ్య, ఎంపీడీఓ, ఉపాధి,

## రైల్వే అండర్ బ్రిడ్జీ పనులను వేగవంతం చేస్తాం

ఓబులవారిపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె రైల్వే అండర్ బ్రిడ్జీ పనులను వేగవంతం చేయించి ప్రజలకు సౌకర్యాలు, అన్ని వసతులు కల్పిస్తామని గుంతకల్లు రైల్వే డివిజనల్ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి రైల్వే అధికారులు పనులు పరిశీలించారు. ముఖ్యంగా విద్యార్థులకు సంబంధించిన ఇబ్బందులు తూములో నుంచి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ సమస్యలకు రైల్వే అధికారులతో చర్చించి తూము నుంచి సురక్షితమైన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

## తొర్రివేములలో భవిష్యత్తుకు గ్యారెంటీ

జమ్మలమడుగు, ఆగస్టు 9, ప్రభాతవార్త:



మైలవరం మండలం తొర్రివేముల గ్రామంలో బుధవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. జమ్మల మడుగు తెదేపా చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో వంద కుటుం బాలు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి తిరుగుతూ తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి భవిష్యత్తు గ్యారెంటీ అని మాజీ సీఎం చంద్ర బాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. తెదేపా అధికారంలోకి వస్తే 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.15వేలు అందిస్తారని సంవత్సరానికి 3గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. చదువుకుంటున్న పిల్లలకు కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఒక్కొక్కరికి రూ.15వేలు అందు తుందన్నారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడం జరుగుతుందన్నా రు. చంద్రబాబునాయుడును వచ్చే ఎన్నికల్లో గెలిపించి సీఎంను చేయాలని అప్పుడే భవిష్యత్తుకు ఆయన గ్యారెంటీ అని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, పాపిరెడ్డి, రామాంజనేయులు, గుర్రప్ప, బాలయ్య, ముని స్వామి, నాగేంద్ర, పెద్దన్న, సురేంద్ర, సునీల్, బాలయ్య, వెంకట సుబ్బయ్య, జయరాముడు, దానం, సుందరం, ఏసన్న, చెన్నప్ప, ఓబులేసు, ముని శేఖర్, దేవదానం, తెదేపా నాయకలు, కార్యకర్తలు, దేవగుడి అభిమానులు పాల్గొన్నారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

### - మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్

జమ్మలమడుగు, ఆగస్టు 9, ప్రభాతవార్త:



జమ్మలమడుగు మండలం పూర్వపు బొమ్మేపల్లిలో జీవనం సాగిస్తున్న పుల్లగూర అంకమ్మ (45) చనిపోగా ఆమెకు బంధువులు ఎవరూ లేకపోవడంతో అక్కడ ఉన్న ప్రజలు మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావును ఫోన్ ద్వారా సంప్రదించగా వారు వెంటనే స్పందించి పూర్వపు బొమ్మేపల్లి నందు సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు, తిరుపాల్, గురు, రాజశేఖర్, శివసాయినాథ్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ సీఎంపై రాళ్ల దాడి అమానుషం

జమ్మలమడుగు, ఆగస్టు 9, ప్రభాతవార్త:



తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చేపట్టిన ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా పుంగనూరులో పర్యటిస్తుండగా వైసీపీ అల్లరిమూకలు రాళ్ల దాడి చేయడం అమానుషమని జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సమంజసం కాదన్నారు. చంద్రబాబు, లోకేష్‌ల పర్యటనలకు జనం నీరా జనాలు పలుకుతుండడంతో వైసీపీలో గుబులు మొదలైందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాకు ప్రజలు పట్టం కట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మె ల్సీ శివనాథ్‌రెడ్డి, జమ్మలమడుగు తెదేపా పరిశీలకులు మద్దూరు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు, క్లస్టరు యూనిట్ ఇన్‌ఛార్జిలు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెదేపా నాయకులపై అక్రమ కేసులు బనాయించడం బాధాకరం

పీలేరు, ఆగస్టు 9 ప్రభాతవార్త



నియోజకవర్గంలో వైసీపీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు తెదేపా నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం బాధాకరమని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి తెలిపారు. తెదేపా నాయకులైన కలికిరి మండలం ఫత్తేగడ గ్రామం, కొటాలి చెందిన వాసునూరి చం ద్రశేఖర్ కుటుంబ సభ్యులను, పీలేరు పట్టణానికి చెందిన స్పోర్ట్సు మల్లి వారి కుటుంబ సభ్యులను తెదేపా కార్యకర్త ప్రసాద్ గుర్రంకొండ టౌన్ నౌషాద్, అమిలేపల్లె గ్రామానికి చెందిన చంద్రబాబు, రెడ్డెన్న కుటుంబ సభ్యులను స్వయంగా వారి వారి ఇల్లకు వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి తెదేపా నల్లారి కుటుంబం అండగా ఉంటుందని నల్లారి తనూజారెడ్డి తెలిపారు.

## కాలుష్య నివారణకు మొక్కలు అవసరం

వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త :



వసుద వందనం దేశ సౌభ్రాతృత్వానికి పునాది అని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ని. యెాగాంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని నందిపల్లెలో మేరీ మట్టి మేరీదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ భవనాల సముదాయాల్లో వసుద వందనం నిర్వహించారు. అనంతరం నందిపల్లె గ్రామ సర్పంచి సులోచనమ్మ మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటి సంరక్షించడం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, కోఆర్డినేటరు శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుళరెడ్డి, వృక్షశాస్త్ర అధ్యాపకులు శ్రీకాంత్‌రెడ్డి, పీడీ తేజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## నేడు వైఎస్సార్ కళ్యాణమస్తు షాదీతోఫా

పీలేరు, ఆగస్టు 9 ప్రభాతవార్తః

ఈఏడాది ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన జంట లకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అమలుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శ్రీకారంచుడుతున్నారు. ఇందుకు అర్హులైన 18, 883 జంటలకు రూ.141.60కోట్లు ఆర్థిక సాయాన్ని తన క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమచేయనున్నారు. గౌరవ ప్రదంగా జరిపించే సామాజిక బాధ్యతకు అండగా నిలుస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడ పిల్లలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, ద్వారా ముస్లీం మైనారిటీ వర్గాల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా ఆర్థిక సాయాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తోందన్నారు.

## తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలు

పీలేరు, ఆగస్టు 9 ప్రభాతవార్తః



ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తపాల శాఖ కార్యాలయాలలో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని తిరుపతి తపాల శాఖ ఎస్ఎస్పీ మహమ్మద్ జాఫర్ సాదిక్ అన్నారు. బుధవారం పీలేరు తపాలా కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించి అమ్మకాలు ప్రారంభించారు. జెండా ఖరీ దు రూ.25 మాత్రమే ఉంటుందన్నారు. ఇప్పటి వరకు తిరుపతి డివిజన్‌లో 27వేలు జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని మరో 40వేలు జెండాలు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్స్‌పెక్టర్ విజయభాస్కర్, పోస్టు మాస్టర్ శేషాద్రి పాల్గొన్నారు.

## వీరుల సేవలు స్ఫూర్తిదాయకం కావాలి

వాల్మీకిపురం, ఆగస్టు 9 ప్రభాతవార్తః



దేశ భద్రత దృష్ట్యా ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న వీరులైన సైనికోద్యోగుల సేవలు ప్రతి పౌరుడికి స్ఫూర్తిదాయకం కావాలని వాల్మీకిపురం, ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని వాల్మీకిపురం, చింతలవారిపల్లె చింతపర్తి, గండబోయినపల్లె, మూరేవాండ్లపల్లె, నగిరి మడుగు, సచివాలయాల్లో బుధవారం ఆజాదికా అమత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నా భూమి- నాదేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్క ల పెంపకాన్ని చేపట్టారు. అనంతరం మాజీ సైనికోద్యోగులు మదన్ మోహన్‌రెడ్డి, రవిచంద్ర, దివంగత సలాది నారాయణ సతీమణులను సన్మానించారు. ఈసందర్భంగా జరిగిన కార్యమ్రంలో అధికారులు, నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత, అభివద్ధి కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా సేవలందించాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, జడ్పీటీసీ నిర్మలమ్మ, సర్పంచి గంగులమ్మ, ఉప సర్పంచి బిడ్డల కేశవరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు శ్రీధర్ రాయల్, ఆర్‌బీకే ఛైర్మన్ నీళ్ల భాస్కర్, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, కిరణ్‌కుమార్, రాయుడు, ఈఓ ఉదయ్‌కుమార్, కార్యదర్శులు ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## అణు ఆయుధాలు వద్దు ప్రపంచ శాంతే ముద్దు

పీలేరు, ఆగస్టు 9 ప్రభాతవార్తః



స్థానిక కోటపల్లె జడ్పీ హైస్కూల్(బాలురు)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో హిరోషిమా నాగసాకిడేని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం శివ శంకరయ్య మాట్లాడుతూ నేటి ప్రపంచ పరిస్థితులలో అణు ఆయుధాలు వద్దు అన్న వస్త్రాలే ముద్దు అని ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రపంచ యుద్దాలు అనాగరికతకు సూచికలని, శాంతి సౌభ్రా తృత్వాలతో ప్రపంచ దేశాలు వర్ధిల్లాలని అన్నారు. ప్రజలకు కావలసింది అణు ఆయుధాలు కాదని, అహింస, శాంతి యుత సహజీవనం కావాలన్నారు. భారత దేశం వద్ద అణు ఆయుధాలు ఉన్నప్పటికి మానవ ప్రయోజనం కోసమే వాటిని ఉపయోగిస్తూ ప్రపంచానికి ఆదర్శంగా ఉందన్నారు. ఈకార్యక్రమానికి సంబం ధించి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు బాబునాయక్, శివశంకర్, వెంకట రమణారెడ్డి, ఖాదర్‌బాషా, కొండప్ప, జయచంద్రారెడ్డి, శేషాద్రిరెడ్డి, సుదర్శన్, నాగరాజరెడ్డి, పురుషోత్తం విద్యార్థులు పాల్గొన్నారు.

## సేవ్ ఇండియా పేరుతో పోస్టల్ కార్యాలయం వద్ద దర్నా

పోరుమామిళ్ళ రూరల్, ఆగస్టు 09 ప్రభాతవార్త:



స్థానిక పోరుమామిళ్ళలోని సబ్ పోస్టల్ కార్యాలయం వద్ద ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని,నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని సమస్యలను పరిష్క రించాలని కోరుతూ బుధవారం సిఐటియు పోరుమామిళ్ళ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భైరవప్రసాద్ హాజరై మాట్లాడుతూ రెండవసారి మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస వేతనాలు, సమాన పనికి-సమాన వేతనం, కేంద్ర ప్రభుత్వం అటకెక్కించిందని, కార్మిక హక్కులను కాలరాస్తూ మోడి ప్రభుత్వం పెట్టుబడుదారులకు ఊడిగం చేస్తుందన్నారు. ఇలాంటి దుర్మార్గమైన మోడి అమిత్‌షా బిజెపి ప్రభుత్వాలను ప్రజలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు తరిమి కొట్టి గద్దె దింపాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు, సుందరం, రత్నం, అంగన్వాడీ, మండల నాయకురాలు రేణుకాదేవి, స్వాతి, రమాదేవి, లూర్దమేరి, లక్షుమ్మ పాల్గొన్నారు.

## భూ రీ సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించండి

### - మండల సర్వేయర్ గిరి ఆచారి

తంబళ్లపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో సచివాలయ సర్వేయర్లు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించాలని సచివాలయ సర్వేయర్లకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని కొట్లపల్లి రెవెన్యూ డివిజన్‌లో జరుగుతున్న భూ సర్వే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భూ రీ సర్వేలో రైతుల నుంచి వచ్చే సమస్యలను సామరస్యంగా పరిష్కరించి అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భూ రీసర్వే కార్యక్రమం పూర్తి కావడానికి సచివాలయ సర్వేయర్లు, స్థానిక వీఆర్వోలు, వీఆర్ఏలు సలహాలు సూచనలతో కృషి చేయాలన్నారు. ఆయన వెంట సర్వేయర్లు అల్తాఫ్, తదితర బృందం, రైతులు పాల్గొన్నారు.

## ఆచరణకు సాధ్యం కాని జి.ఓ.లను రద్దు చేయాలి

కడప, ఆగస్టు 9, ప్రభాతవార్త :



అంగన్ వాడిలలో కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఎఫ్.ఆర్.ఎస్. నిర్వహణ ఆచరణలో చాలా అసాధ్యంతో కూడుకున్నది. వైఎస్ఆర్ యాప్లో ఉన్న లబ్ధిదారుల వివరాలు ఎఫ్.ఆర్.ఎస్.లో కనిపించడంలేదు. అలాగే సరియైన, నాణ్యమైన సెల్ ఫోన్లు లేకపోవడం, 12.బి. నెట్వర్క్ సరిపోకపోవడం, సక్రమమైన ట్రైనింగ్ లేకపో వడం, త్వరత్వరగా చేయాలని ఒత్తిడిచేయడం, లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడం, ఇవన్నీ పరిగణలోకి తీసుకోకపోవడంతోపాటుగా ప్రీ స్కూల్, మిగతా యాప్ల నిర్వహణ అసాధ్యం. వీటిని సజావుగా నిర్వహించేందుకు ఎఫ్.ఆర్.ఎస్. యాప్ సక్రమ అమలుకు నాణ్యమైన సెల్ఫోన్లు ఇవ్వాలి. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని ఆచరణ యోగ్యమైన పద్ధతి అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వం తీసుకువస్తున్న యాప్‌లు అంగన్ వాడి వర్కర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచే స్తున్నాయని ఎపి ప్రగతిశీల అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్ టియూ అనుబంధం ) అధ్యక్ష కార్యదర్శులు జె. గంగావతి, విఆర్ జ్యోతిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికై సెల్ సిగ్నల్ అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు.

## కేంద్రం నిధులు వైకాపా ప్రభుత్వం పందికొక్కుల్లా స్వాహా

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి

రాజంపేట అర్బన్, ఆగస్టు 9 ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు గ్రామీణాభివృద్ధి కోసం గ్రామ పంచాయతిలకు కేటాయించిన నిధులను రాష్ట్రంలో ఉన్న వైకాపా ప్రభుత్వం పందికొక్కుల్లాగా స్వాహా చేసిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం రాజంపేటలో జరిగిన పార్టీ నేతల సమా వేశంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం కేంద్రం మంజూరు చేస్తున్న నిధులను పూర్తిస్థా యిలో దుర్వినియోగం చేసిందని ధ్వజమెత్తారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను స్వాహా చేశారని ఆరోపించారు. నిధుల దుర్వినియోగంపై ఈనెల 10న అన్నిజిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలను చేపడుతున్నామని పేనర్కొన్నారు. ఈ ఆందోళన కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ప్రజలు తరలివచ్చి రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మిత్రపక్షమైన జనసేన పార్టీతో కలిసి రాష్ట్రస్థాయిలో ఈనెల 17న విజయవాడలో మహా ఉద్యమ కార్యక్ర మం చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి సాయిలోకేష్‌లు పాల్గొన్నారు.

## మిట్టపల్లి గ్రామంలో టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ

### - టీడీపీ సీనియర్ నాయకుడు కాడే చెంచయ్య నాయుడు

సిద్దవటం, ఆగస్టు 9, ప్రభాతవార్త:



మండలం పెద్దపల్లె గ్రామ పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నేత కాడే చెంచయ్య నాయుడు టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజం పేట టీడీపీ ఇన్‌ఛార్జి బత్యాల చంగల్రాయుడు హాజరయ్యారు. టీడీపీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించి మేనిఫెస్టో వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో వైకాపా పాలనలో దోపిడీలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు, ఇసుక మాఫియా ఎక్కువయ్యాయన్నారు. సైకో పోవాలి సైకిల్ రావాలంటూ తెదేపా అధికారంలోకి వచ్చాక వచ్చే సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భారీ ఎత్తున టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తప్పుడు నివేదిక ఇచ్చిన మహిళా వైద్యురాలు

### - కడప రిమ్స్ ఆర్ఎంఓ శ్రీనివాసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

సిద్దవటం, ఆగస్టు 9, ప్రభాతవార్త:



మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన బాబాఫక్రుద్దీన్ తప్పుడు వైద్య నివేదిక ఇచ్చిన మహిళా వైద్యురాలుపై చర్యలు తీసుకోవాలని బుధవారం కడప రిమ్స్ ఆర్ఎంవో శ్రీనివాసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే మాధవరం గ్రామానికి చెందిన బాబాఫక్రుద్దీన్ విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబరు నెల 5వ తేదీన మాధవరం గ్రామంలో భూ వివాదంపై జరిగిన ఘర్షణలో నాకు గాయాలు కావడంతో వైద్యం కోసం కడప రిమ్స్‌లో చేరడం జరిగిందన్నారు. సుమారు పది రోజుల పాటు రిమ్స్‌లో చేతి వేళ్లకు తగిలిన గాయాలకు మహిళా వైద్యురాలు శస్త్ర చికిత్స చేశారు. ఘర్షణ విషయంపై సిద్దవటం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినా మహిళా వైద్యురాలు దాడి చేసిన ముద్దాయిలతో కుమ్మక్కై కేసు సీట్లో ఉన్న విషయాలను మరుగున పెట్టి ఎలాంటి గాయాలు లేవని తప్పుడు రిపోర్టు ఇచ్చి కేసును నీరుగార్చి నన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని బుధవారం కడప రిమ్స్ ఆర్ఎంఓ శ్రీనివాసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాబాఫక్రుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన రిమ్స్ ఆర్ఎంవో శ్రీనివాసులు వైద్యశాలలోని రికార్డులను పరిశీలించి మహిళా వైద్యురాలు కోడూరు ప్రభుత్వాసుపత్రికి బదిలీపై వెళ్లారనీ, చరవాణి ద్వారా ఫిర్యాదుపై విచారణ చేయడమే కాక మహిళా వైద్యురాలును కడప రిమ్స్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని చెప్పారన్నారు. తప్పుడు వైద్య నివేదిక ఇచ్చిన మహిళా వైద్యురాలు విచారణ చేసి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా వైద్యురాలిపై కడప రిమ్స్ ఆర్ఎంవో చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఆయన కోరారు.

### ప్రభాతవార్తకు స్పందన

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

సిద్దవటం, ఆగస్టు 9, ప్రభాతవార్త:



మండలంలోని వెంకటాయపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం ప్రభాతవార్త కథనానికి స్పందించి మండల విద్యాశాఖాధికారి శంకరయ్య తనిఖీ చేసి రికార్డులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు సెలవు పెట్టాలంటే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అధికారులకు తెలియజేసి అనుమతి పొంది ఆ తరువాత సెలవు పెట్టాలన్నారు. ఉపాధ్యాయుడు 20 రోజులు మెడికల్ లీవ్ తీసుకోవడంపై ఆయన మండిపడ్డారు. ఉపాధ్యా యులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని పాఠశాల హెచ్ఎంను ఆదేశించారు.

## సేవ్ ఇండియా పేరుతో పోస్టల్ కార్యాలయం వద్ద ధర్నా

బద్వేలు అర్బన్, ఆగస్టు 9 ప్రభాతవార్త :



ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని సిఐటియు పట్టణ కన్వీనర్ కే నాగేంద్రబాబు అన్నారు, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ అఖిల భారత కమిటీ పిలుపుమేరకు స్థానిక పోస్టల్ కార్యాలయం వద్ద ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ కె. నాగేంద్ర బాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస వేతనాలు, సమాన పనికి- సమాన వేతనం, రెగ్యులరైజేషన్, కార్మిక సంక్షేమలను, కేంద్ర ప్రభుత్వం అటకెక్కించిందని,కార్మిక హక్కులను కాలరాస్తూ, యజమానులకు ఊడిగం చేస్తుందని,బిజెపి మోడీ ప్రభుత్వం ప్రజల ఆస్తులను, ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, ఆదాని, టాటా లకు కారుచౌకగా కట్ట పెట్టుతుందని వారు దుయ్యబట్టారు. ఈ విధానాలవల్ల భవిష్యత్తు తరాలకు ఉద్యోగాలు దొరకవని, రిజర్వేషన్లు ఉండవని, సంఘటిత ప్రభుత్వం కనుమరుగై ఇస్తారంగా ఉన్న కోట్లాదిమంది అసంఘటిత కార్మికులకు ఆధారం లేకుండా పోతుందని వారు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు కనువిప్పు తెచ్చుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ,కర్షక, ప్రజలు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు ఇరుపోతు ఓబులేసు, పులి శ్యాంప్రవీణ్, పట్టణ కో కన్వీనర్ పి.సి. కొండయ్య, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## దక్షిణభారత స్థాయి క్రీడల్లో రాజంపేట నవోదయ విద్యార్థుల ప్రతిభ

రాజంపేట అర్బన్, ఆగస్టు 9 ప్రభాతవార్త



రాజంపేట మండలం నారంరాజువల్లెలోని జవహర్ నవదోయ విద్యార్థులు దక్షిణ భారత స్థాయి క్రీడల్లో సత్తా చాటారు. దక్షిణభారతదేశంలోని జవహర్ నవోదయ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో కేరళా రాష్ట్రంలోని కాసర్గడ్‌లో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో అండర్-17 జట్టు ప్రథమ స్థానాన్ని అండర్-14 జట్టు, అం డర్-19 జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధిం చారు. ఇందులో విద్యార్థినులు శివాని, సూర్యదీక్షిత, సాయికీర్తన, భువనేశ్వరి, ప్రదీప పంజాబ్ రాష్ట్రంలో పటియాలాలో జరగబోయే బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీల్లో శివాని సర్వోత్తమ క్రీడాకారిణిగా ఎంపికైంది. కబడ్డీలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన 11వ తరగతి విద్యార్థిని తనుశ్రీ ఉత్తరప్రదేశ్ గోండాలో జరగబోయే కబట్టీ పోటీల్లో పాల్గొంటుంది. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానాన్ని సాధించిన 11వ తరగతి విద్యార్థి మహేష్, డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానాన్ని సాధించిన 12వ తరగతి విద్యార్థి మహేష్‌యాదవ్‌లు పూణేలో జరగబోయే జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారు. క్రికెట్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 11వ తరగతి విద్యార్థులు సృజన్, ప్రవీణ్‌లు లక్నోలో జరగబోయే జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారు. త్రిశూల్‌లో జరిగిన సుబ్రతో కప్ ఫుట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించి రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన సమావేశంలో ప్రతిభ చాటిన విద్యార్థులను నవోదయ ప్రిన్సిపల్ గీత అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు యాస్మిన్, అన్నాదురైలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో కూడా గౌరవాన్ని నిలబెట్టేలా విద్యార్థులు క్రీడల్లో తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

## వైభవంగా ఆడికృత్తిక వేడుకలు

మదనపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త :



పట్టణంలోని సుబ్రమణ్యంస్వామి ఆలయాల్లో బుధ వారం ఆడికృత్తిక వేడుకలు వైభవంగా జరిగాయి. మడికయ్యల శివాలయం ఆవరణంలోని సుబ్ర మణ్యం స్వామికి ప్రత్యేకంగా అభిషేకం చేసి ఆడికృత్తిక పూజలు వైభవంగా చేశారు. వరాల ఆంజినేయస్వామి ఆలయం లో శ్రీసుబ్రమణ్యం స్వామికి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. పట్టణ శివార్లలోని వశిష్టస్కూల్ వద్ద ఉన్న శ్రీవల్లిదేవ సుబ్ర మణ్యంస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఘనంగా జరిగింది. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## పెద్దిరెడ్డి కుటుంబంపై విమర్శలు చేస్తే సహించం

### కౌన్సిలర్ మొబీనా, డైరెక్టర్ సుజాత

మదనపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త :




రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి కుటుంబంపై టిడిపి నాయ కులు లేనిపోని విమర్శలు చేస్తే సహిం చేది లేదంటూ 22వ వార్డు కౌన్సిలర్ మొబీనా సలీం, మేధరసంఘం డైరెక్టర్ తాలే సుజాతసుబ్బు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా అంగళ్ళు, పుంగనూరుకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెచ్చ గొట్టే ప్రసంగాలు చేయడం వల్లే టిడిపి కార్యకర్తలు, ఇటు వైకాపా కార్య కర్తలు, అటు పోలీసులపైన దాడులు చేశారన్నారు. టిడిపి వారే దాడులు చేసి పెద్దిరెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. అధికార దాహంతో టిడిపి నాయకులే దౌర్జన్యాలకు దిగుతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టిడిపి నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమం లో వైకాపా నాయకులు సలీం, తాలే సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

## దళిత కుటుంబపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

మదనపల్లెక్రైం, ఆగస్టు 9 ప్రభాతవార్త



మదనపల్లె రూరల్ మండలం మాలే పాడు పంచాయతీ కత్తివాండ్లపల్లెకు చెం దిన వెంకటరమణ కుటుంబంపై దాడిచేసి గాయపరిచిన వారిని అరెస్టు చేయాలని బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గాయపడిన వెంకటరమణను పరామర్శించి మాట్లాడుతూ వెంకట రమణపై వారి కుటుంబసభ్యులపై దాడిచేసిన శంకర్ మిగిలిన ఐదు మందిని అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. దాడిచేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రా సిటి కేసు నమోదు చేసి బాధితులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## నాభూమి..నాదేశం శిలాఫలకాల ఆవిష్కరణ ప్రారంభం

రామసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త:



మండలంలోని కుదరుచీమనపల్లె గ్రామ పంచాయితీలో సచివాలయ ఆరణం లో మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బుధవారం మండలంలోని కేసిపల్లెలో ఆజాధిక అమృ త మహోత్సంలో నాభూమి, నాదేశం, నేలతల్లికి నమస్కారం,వీరులకు వందనం కుదురుచీమనపల్లెలో ఎంపిడిఓ నారా యణ స్వామి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డిల ఆధ్వ ర్యంలో శిలాఫలకాల ఆవిష్కరణ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పాఠశాల ప్రాంగణంలో, అంగన్ వాడీ సచివాలయాలలో 100మొక్కలు నాటే విధంగా చర్యలు తీసు కొంటామని తెలిపారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డి, మినికి సుబ్బారెడ్డి, ఏపీఓ గౌరీశంకర్, సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, గృహసారధులు, సచివా లయ సిబ్బంది, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు సర్వతోముఖాభివృద్ది చెందాలి : డిఎల్‌పిఓ

రామసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త:



విద్యార్థుల సర్వతోముఖాభివృద్దికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఎల్ పిఓ నాగరాజు అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలకు బుధవారం విచ్చేసిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలిం చారు. పుస్తక పరిజ్ఞానంపై విద్యార్థులను ప్రశ్నించారు. హాస్టల్ గదులను పరిశీలిం చి సంతృప్త వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి క్రమశిక్షణ నేర్పించాలని, వారి ఉన్నత భవిష్యత్తుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని నాగరాజు కోరారు. ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్ అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో నరసాపురం రవి, ఉపసర్పంచ్ రమేష్, పంచాయితీ సెక్రటరీ రామక్రిష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ, యాజమాన్య నిర్లక్ష్యంతోనే సమ్మె

మదనపల్లెక్రైం, ఆగస్టు 9 ప్రభాతవార్త




విద్యుత్‌శాఖలో పనిచేసే ఉద్యోగుల సమస్యల కోసం గత నాలుగేళ్లుగా యాజ మాన్యంతో చర్చిస్తున్న ఫలితంలేకపోవటం తో గత్యంతరం లేక సమ్మెలోకి వెళ్లుతు న్నామని విద్యుత్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ జాఫర్‌వల్లీ, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం వారు ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట గురు వారం నుంచి జరిగే సమ్మె వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదిసంవత్సరాలుగా దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనంతగా వినియోగ దారులకు సేవలు అందజేసి పలు అవార్డులు సాధించటంలో తమ ఉద్యోగుల కృషి ఎంతో వుందన్నారు. అలాంటి తమ ఉద్యోగుల కొరుతున్న విధంగా పిఆర్‌సి ఇవ్వకపోగా సింగల్‌మెన్ కమిటీ అయినా మన్మోహన్‌సింగ్ కమిటీ నిర్ణయాలను అమలు చేస్తామని చెప్పి బెదిరించటం సబబుకాదన్నారు. సంస్థ అర్ధిక మూలాలు దెబ్బతీసే మన్మోహన్‌సింగ్ కమిటీని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తాము చేసే సమ్మెకు వినియోగదారులు సంఘీబావం తెలపాలని కోరారు.

## కాఫర్ వైర్ల కోసం దొంగల హల్‌చల్

### లబోదిబోమంటున్న రైతన్నలు

చిట్వేలి, ఆగస్టు 9 ప్రభాతవార్త

ఆరుగాలం శ్రమించి అందరికి తిండి పెడుతున్న రైతన్నలు ఒకవైపు అప్పుల భారంతో అల్లాడుతుంటే మరోవైపు కాపర్ వైర్ కోసం జరుగుతున్న దొంగతనాలతో లబోదిబోమంటున్నారు. వివరాలను పరిశీలిస్తే చిట్వేలి మండల పరిధిలోని తుమ్మచెట్లపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి తిరుమల శివయ్య, పోలిన శివయ్య, రంపా జయరాంల రైతుల పొలాల్లో స్టార్టర్ పెట్టె నుంచి మోటార్లలోకి వెళ్లే కాఫర్ వైర్లను కత్తిరించి దొంగలు తీసుకెళ్లడంతో రైతులు బోరుమంటున్నారు. కాగా గతంలో పలు ట్రాన్స్‌పార్మర్లను పగులగొట్టి, వైర్లను కత్తిరించి అందులోని కాఫర్ వైర్లు దొంగలించి రైతుల పంటలను ఎండగట్టిన పరిస్థితి చిట్వేలి మండలంలోని పల గ్రామాల్లో చోటు చేసుకుంది. ఇట్టి దొంగతనాలను అరికట్టి రైతులకు రక్షణ కల్పించాల్సిన పోలీసుశాఖ మొక్కుబడిగా కేసులు నమోదు చేసి నామమాత్రపు విచారణతో తమ పని అయిపోయినట్లు వ్యవహరిస్తూ ఉందని మండల వ్యాప్తంగా విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా ఇలాంటి చోరీదారులపై కఠినంగా వ్యవహరించి మాలాంటి రైతులను ఇబ్బందులకు గురికాకుండా కాపాడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## క్వారీ కార్మికుని ఆకస్మిక మృతి

రామసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త



రామసముద్రం మండలం ఎలవానెల్లూరు పంచాయతీ పైగడ్డ గ్రామం వద్ద నున్న క్వారీ లో కూలీ గా పనిచేస్తున్న ఒరిస్సా వాసి ప్రతీప్ నాయక్ 25 ఆకస్మికంగా జరిగిన ప్రమా దంలో మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం మేరకు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రతీప్ నాయక్ గత కొంతకాలంగా క్వారీలో కూలీ గా పనిచేస్తున్నాడు.ఈనేపథ్యంలో బుధవారం క్వారీలో పజనిచేస్తుండగా అకస్మాత్తుగా ఇనుప పైపు ప్రతీప్ పై పడింది.దీనితో తీవ్రంగా గాయపడిన అతనిని వైద్యం కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిన ట్లు సమాచారం.

## సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

మదనపల్లెక్రైం, ఆగస్టు 9 ప్రభాతవార్త




అన్నమయ్యజిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం ఆదేశాల మేరకు మదన పల్లె డివిజన్ స్థాయిలో బుధవారం సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్స్‌పైర్‌మనక్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాశాఖా ధికారి క్రిష్ణప్ప మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్యాల నుంచి ఇన్స్పైర్ నామినేషన్‌లకు ఈనెల 31లోపు పూర్తి చేయాలని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుండి మూడు, ప్రతి హైస్కూల్‌నుంచి 5 నామినేషన్‌లను తప్పక చేయాలని తెలిపారు. డిఎస్‌ఓ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ రెడిమేడ్ నమూనాలను అనుమతిం చిబడవని, చిన్నారుల నుంచి వచ్చిన ఆలోచనలను కార్యరూపం దాల్చేవిధంగా ఉంటే వాటిని ఎంపిక చేయాలని సూచించారు. ఈ నమూనాలను డిపార్ట్‌మెంటు ఆఫ్ సైన్స్ టెక్నాలజీ నేషనల్ ఇన్నోవేషన్ పౌండేషన్ వారు ఎంపిక చేయ బడుతారని తెలిపారు. ఎంపిక చేసిన వారికి రూ.10వేలు ఆర్థికసాయం అంద జేస్తారని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాజగోపాల్, రిసోర్స్‌పర్సన్‌లు పిఎల్‌ఎన్ శాస్త్రి, వరప్రసాద్, కె.భాస్కర్, డివిజన్‌లోని భౌతిక రసాయనిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాచమల్లు మరణాన్ని కోరుకునే అవసరం టిడిపికి లేదు

### టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు ఆగస్టు 9, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కేవలం తమ రాజకీయ ప్రత్యర్థి గాని చూస్తామని రాచమల్లు మరణాన్ని కోరుకునే అవసరం టిడిపికి లేదని టిడిపి ఇన్చార్జి జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు టిడిపి నాయకులు తన మరణాన్ని కోరుకుంటున్నారన్న ఎమ్మెల్యే రాచమల్లు వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర చరిత్రలో హత్యా రాజకీయా లకు పాల్పడే అగత్యం టిడిపికి లేదని తెలిపారు. కేవలం మానసిక ఆందో ళనతోనే ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నట్లు స్పష్టమవు తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై అధికారులను ప్రశ్నిస్తే తట్టుకోలేని రాచమల్లు దీక్షకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజంగా సత్యాన్వేషణ దీక్ష చేయాలంటే నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం దిశగా దీక్ష చేపట్టాలని రాచమల్లుకు సూచించారు. వైసీపీ పాలనపై ప్రశ్నిస్తున్న టిడిపి నాయకుల విమర్శలు చేస్తూ తన మరణాన్ని టిడిపి నాయకులు కోరుకుం టు న్నారని వ్యాఖ్యలు చేయడం రాచమల్లుకే చెల్లిందన్నారు. రాజకీయాలలోకి కుటుంబ సభ్యులను లాగడం రాచమల్లు దిగజారుడు రాజకీయాలకు నిదర్శ నం అన్నారు. ఇప్పటినుండి అయినా సేవ కోసం రాజకీయాలు చేయాల తప్ప కుటుంబ సభ్యులను లాగడం సరికాదని హితవు పలికారు. ఈసమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వివిస్ ముక్తియార్ టిడిపి పట్టణ అధ్య క్షులు ఇవి సుధాకర్ రెడ్డి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు లు పాల్గొన్నారు.

## కృష్ణారెడ్డికి శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే

రామాపురం ఆగస్టు 9, ప్రభాతవార్త



మండలంలోని నల్లగుట్టపల్లె పంచా యతీ బి రాచపల్లికు చెందిన వైఎస్ ఆర్‌సిపి నాయకుడు మోపూరి కృష్ణారెడ్డి దశ దిన ఖర్మకాండలో బుధవారం ఎంఎల్‌ఏ శ్రీకాంత్ రెడ్డి పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ చైర్మన్ కర్ణపు విశ్వనాథ రెడ్డి,సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సత్యా యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## 'నా భూమి నా దేశం' కార్యక్రమం

చిట్వేలి, ఆగస్టు 9 ప్రభాతవార్త



'ఆజాదిక అమృత మహోత్సవ్'లో భాగంగా నా భూమి నా దేశం అన్న నినా దంతో బుధవారం ఎంపిడిఓ శివారెడ్డి అధ్య క్షతన, ఎపిఓ చంద్రకళ ఆధ్వ ర్యంలో చిట్వేలి మండలంలోని నక్కలపల్లి, తిమ్మ య్యగారిపల్లె, మార్గోపల్లి, కంపసముద్రం, కెవిఆర్ పురం, మహారాజపురం పంచాయతిల్లో 'నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వీరులకు శిలాఫలకం అంకితం చేయడం, హాజరైన వారితో పంచ ప్రాణ ప్రతిష్ట చేయడం, చెట్లు నాటడం, వీరులకు వందన సమర్పణ తదితర అంశాలను నిర్వహించారు. ఈసీ ఎ.ఓబు లేశు, టిఎలు ప్రకాష్, వీరయ్య, శ్రీనివాసులు, బిఎఫ్‌టి మల్లిక, ఫీల్డ్ అసిస్టెం ట్‌లు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం విజయవంతం

కలికిరి, ఆగస్టు 9, ప్రభాతవార్త:



ఆజాద్‌కా అమృత్ మహోత్సవ్ కార్య క్రమంలో భాగంగా కలికిరి-మదనపల్లి రోడ్డు మార్గంలోని గండబోయినపల్లి సమీ పంలో దినే సందర్భ గ్రీన్ ఫ్రా ప్రాజెక్ట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం అన్నమయ్య జిల్లా డీపీఎంవో డాక్టర్ లోకవర్ధన్ పర్య వేక్షణలో వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరంలో చింతపర్తి వైద్యాధికారిణి శ్రీవిద్య రోగులకు చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్య క్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మహ్మద్ రఫీ, గ్రిల్ ఏవీపీ రవికుమార్, సునీల్ పాల్గొన్నారు.

## నా భూమి నా దేశం నేలతల్లికి నమస్కారం కార్యక్రమం విజయవంతం : ఎంపిడిఓ

వీరబల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని ఎంపి డిఓ కార్యాలయంలో మరియు టాటిగుంటపల్లి సచివాలయంలో నా భూమి, నా దేశం, నేలతల్లికి నమ స్కారం, వీరులకు వందనం అనే కార్యక్రమం విజయవంతమైందని బుదవారం ఎంపీడీవో మల్లేశ్వరి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాది కా అమృత్ మహో త్సవంలో భాగంగా ఈనెల తొమ్మిదో తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా పంచాయతీలలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటీసీలు, సచివా లయ సిబ్బంది తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

మైదుకూరు ఆగస్టు 9, ప్రభాతవార్త



వై.యస్.ఆర్.సి పి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి. బుధవారం మండల పరిధిలోని తువ్వపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన వై.యస్ ఆర్.హెల్త్ క్లినిక్ మరియు రూ20.80లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ఆర్‌బికె భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలోఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవ సాయ ప్రభుత్వ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, మైదుకూరు నియో జకవర్గ వై.యస్.ఆర్.సి పి సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గడిచిన 4సంలలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందు తున్నాయని సచివాలయ వ్యవస్థను అమలుపరిచి సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను అన్ని రకాల హంగులతో నిర్మిస్తుం దన్నారు. రైతులకు కావలసిన ఎరువులు, మందులు ఆర్బికెలలో అందు బాటులో ఉంటున్నాయన్నారు.రైతులకు వ్యవసాయానికి అవసరమైన సాగు నీటిని రెండు కార్లు పండించుకునేందుకు నీటి సరఫరా చేపడుతున్నా మన్నా రు. కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నా రాయణ రెడ్డి,మండల వైస్ ప్రెసిడెంట్ ఊటుకూరు రఘురామిరెడ్డి. అట్లూరి సుబ్బారెడ్డి, గౌస్ లాజం వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## 14న శ్రీకామేశ్వరి శ్రీ మహానందీశ్వరుల కళ్యాణ మహోత్సవము

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 9 పభాతవార్త

ప్రభాతవార్త దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన నందీశ్వ రుడు జన్మించిన శక్తివంతమైన ఆది పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి శ్రీ మహానందీశ్వరుల కళ్యాణ మహోత్సవము లోకకళ్యా ణార్థం ముఖ్యంగా మన ప్రొద్దుటూరు పట్టణ క్షేమము ఆరోగ్యం సౌభాగ్యముల కోసమై పవిత్రమైన అధిక శ్రావణమాస బహుళ చతుర్దశి మాస శివరాత్రి శుభ సందర్భంగా ఈనెల 14వ తేదీ సోమవారం సాయంకాలం నాలుగు గంటల నుండి మహానంది దేవస్థానం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సభ సహాయ సహకార ములతో మహానంది దేవస్థానం అర్చకులచే మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం శాంతి కళ్యాణ -మహోత్సవములు నిర్వహించబడు నని ఆర్య వైశ్య సభ అధ్యక్షుడు బుసెట్టి రామ్మోహన్రావు, కార్యదర్శి మురికి నాగేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రొద్దుటూరు పట్టణ పుర ప్రజలు పాల్గొని శ్రీ కామేశ్వరి దేవి సమేత శ్రీ మహానందీశ్వరుల దైవానుగ్రహం పొందవలెనని వారు కోరారు.

## సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 9, ప్రభాతవార్త:



సేవ్ ఇండియా అనే దానిపై సీఐ టీయూ ధర్నా కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు అంబబేద్కర్ విగ్ర హం వద్ద నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు దాటి పోయింది. అయితే ఈ కాలంలో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల నడ్డి విరిచిందని తెలి పారు. దేశంలో ప్రజల పన్నుల రూపంలో సంపాదించుకున్న ఆస్తులను ప్రైవేటు వారికి కారు చౌకగా దారా దత్తం చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ, టీడీపీ, జనసేనలు మోదీ ఏది చెబితే దానికి డూడూ బసవన్నలా తలలూపుతున్నా రన్నారు. ఇటువంటి పార్టీలను ఇంటికి సాగనంపాలని క్విట్ ఇండియా సేవ్ ఇండి యా అని దేశవ్యాప్తంగా ఆందోళన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ అధ్యక్షులు చంటి రాఘవ, రవి, మోహన్, మున్సిపల్ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, గురమ్మ, నిత్యమ్మ, రమణమ్మ, ప్రమీలమ్మ, శాంతి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నా మట్టి.. నాదేశం..

కమలాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త:



నా మట్టి.. నాదేశం కార్యక్రమాన్ని బుధవారం సీఎస్‌ఎస్‌ఆర్ అండ్ ఎస్‌ఆర్ ఆర్‌ఎం డిగ్రీ పీజీ కళాశాలలో నిర్వహిం చారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్ ఎస్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరవీరుల జ్ఞాపకార్థం ఆగస్టు 9 నుంచి 30వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సి పల్ సీవీ రాజ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం సముపార్జనలో ఎందరో మహనీయులు ఎన్నో కష్టాల కోర్చి ఉద్యమాలు చేసి ప్రాణాలు అర్పించి మనకు స్వాతంత్ర్యం సంపాదించి పెట్టారని దానిని ఈనాడు మనం సక్రమంగా ఉపయోగించుకున్నప్పుడే సార్ధకత చేకూరుతుందని తెలిపారు. యువత నాటి మహనీయుల స్ఫూర్తిని, త్యాగాన్ని తెలుసుకొని నడుచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.పల్లా కృష్ణ, ఎన్‌ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎస్.అశోక్‌కుమార్, అయ్యవారు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు భరోసా : చైతన్యరెడ్డి

కమలాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త:

కమలాపురం తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ ఐటీడీపీ కార్యకర్తలతో సమావేశమైన తెదేపా యువ నాయకులు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సోషల్ మీడియా లో టీడీపీ పైన వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని అదే విధంగా చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో భవిష్యత్తుకు గ్యారెంటీ అని సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పించాలని ఈ సందర్భంగా ఆయన సూచిం చారు. తెదేపా కార్యకర్తలకు, అభిమానులకు అన్ని విధాలుగా అండగా ఉంటా మని ఏ సమస్య వచ్చినా మా ఇంటి తలుపులు తట్టచ్చని అధికారంలోకి వస్తే అన్ని విధాలుగా న్యాయం చేస్తామని ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు ఎల్లారెడ్డి, మండల ఐటీడీపీ ఛాంపియన్స్ మణికంఠ, అబ్దుల్ నబీ, నరసింహాచారి, సురేష్, పార్లమెంటు, ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి దర్బార్ బాషా, పట్టాభిరాఘవ, వినయ్, నియో జకవర్గ ఐటీడీపీ ఛాంపియన్ బిట్టి, ఆది, ప్రతి పంచాయతీ నుంచి ఐటీడీపీ ఛాంపియన్స్ పాల్గొన్నారు.

## మిషన్ రాయలసీమ డిక్లరేషన్ కరపత్రాలతో విస్తృత ప్రచారం

ప్రొద్దుటూరు ఆగస్టు 9, ప్రభాతవార్త



రాయలసీమ అభివృద్ధికై టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రవేశపెట్టిన మిషన్ రాయల సీమ డిక్లరేషన్ కరపత్రాలను కడప జిల్లా సమ న్వయకర్తలు నల్లబోతుల నాగరాజు జియావుద్దీన్ బుధవారం విస్తృత ప్రచారం చేశా రు. నారా లోకేష్ తన ఇవ్వ గలం పాదయాత్రలో రాయలసీమ జిల్లా పర్యటన సం దర్భంగా రాయలసీమ జిల్లాలైన కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలో పర్యటించి ఇక్కడి నిరుద్యోగులు ఎదుర్కొన్న ప్రధాన సమస్య జాబు లేక పోవడం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నారని తెలిసిందే. దీన్ని దృష్టి లో ఉంచుకొని యువగళం పాద యాత్రలో మిషన్ రాయలసీమ డిక్లరేషన్‌ను కడప లో విడుదల చేశారు. దీనిపై కడప పట్టణంలోని ప్రధాన కూడలిలో ప్రజలకు డిక్ల రేషన్ కరపత్రాలను పంచుతూ వివరించారు. కార్యక్రమంలో తెలుగు యువత సభ్యులు అడ్వకేట్ శివ, మహమ్మద్ కడప పట్టణ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ తెలుగు యువత సభ్యులు పాల్గొన్నారు.

## వైవీయూలో మేరీ మట్టి మేరా దేశ్ ఉత్సవాలు

వైవీయూ ఆగస్టు 9, ప్రభాతవార్త



యువతలో విద్యార్థుల్లో దేశభక్తి కాంక్షను పెంచేలా, స్వాతంత్ర స్వేచ్ఛ కోసం అసువులు బాసిన మహనీయు లను నిత్యం మనసులో ఉంచుకొనేలా చైతన్యం తీసుకురావాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచారి చింతా సుధాకర్ ఉద్బోటించారు. కేంద్ర యువజన సర్వీసుల శాఖ మార్గ దర్శకం మేరకు వైవియు బొటానికల్ గార్డెన్‌లో "వసుధ వందనం"లో భాగం గా వైవియులోని ప్రతి ఎన్ఎస్ఎస్ యూనిట్ 75 మొక్కలు నాటే కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ ప్రారంభించారు. జాతీ య సేవా పథకం సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆజాదీక అమృత మహోత్సవంలో భాగంగా " మేరి మట్టి మేరా దేశ్ " కార్యక్రమం బుధవారం విద్యాలయంలో నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మట్టిని పట్టుకొని సెల్ఫీ ఫోటోలు తీసుకొన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంక ట్రామిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు "పంచె ప్రాణ్" ప్రతిజ్ఞ ను అధ్యాపకులు విద్యార్థులు వాలం టీర్లతో చేయించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సునీత, డాక్టర్ వసు గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ ఎస్పీ వెంకటరమణ, డాక్టర్ లలిత, ఆచార్య ఏజీ దాము, ఆచార్య చంద్రమతి శంకర్, ఆచార్య కాత్యాయిని, అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## స్థలాని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెంచలయ్య

బద్వేలు అర్బన్, ఆగస్టు 9 ప్రభాతవార్త :



బద్వేలు మునిసిపాలిటీలోని, చెన్నంపల్లి పొలం సర్వేనెంబర్ 1770 ప్లాట్ నెంబర్ 513 సంత య్య ఇంటి స్థలాన్ని ఆక్రమించు కొని అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు గూడూరు పెంచలయ్య పేర్కొన్నాడు. ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళితుల స్థలాన్ని ఆక్రమించుకొని వారిపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని ఎనిమిది రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న వారికి మద్దతుగా బుధవారం నాడు దళిత హక్కుల పోరాట సమితి మద్దతు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లా డుతూ పట్టణంలో దళితు లపై, దళిత స్థలాలను అగ్ర వర్ణ పెత్తందారులు ఆక్ర మించుకొనుట పరిపాటి అయిందని, వారికి న్యాయం చేయవలసిన రెవెన్యూ అధి కారులు నిర్లక్ష్యంగా వహించడం వల్ల ఈరోజు దళితలకు ఇచ్చిన స్థలాలకు భద్రత లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తపరిచాడు. ఇప్పటికైనా తాసిల్దార్ వారు త్వరగా చూపి గంజి కుంట చంటయ్య స్థలాన్ని ఆక్రమించుకున్న శ్రీరాములు, శ్రీకాంత్ రెడ్డి, వెంకట సుబ్బయ్యలపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి పట్టణ నాయకులు మునిరత్నం పి నరసింహ పాల్గొన్నారు. ఈ దీక్షలకు మద్దతుగా ప్రజాసంఘాల నాయ కులైన ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేసి మునయ్య, ఏపీ దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగిపోగు నారాయణ, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగిపోగి చిన్నయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాసులు, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించి ఆదర్శకాలనీలుగా తీర్చిదిద్దుదాం

### ఎంఎల్ఏ శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం ఆగస్టు 9,ప్రభాతవార్త



మండలంలోని జగనన్న కాలనీలలోమౌళిక వసతులను కల్పించి ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దుతామని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం గాలివీడు లోని గుర్రాల మిట్ట వద్ద ఉన్న జగనన్న కాలనీని ఎమ్మె ల్యే శ్రీకాంత్ రెడ్డి సందర్శించారు. గృహ నిర్మాణాల స్థితి గతులుపై ఆరా తీశారు. గృహ నిర్మాణాలలో వేగం పెంచాలని ,లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు లలో ఎటువంటి నిర్లక్ష్యం వహించొద్దని అధికారులుకు శ్రీకాంత్ రెడ్డి సూచిం చారు. కాలనీ పరిసర ప్రాంతాలలో ప్రమాదకరంగా ఉన్న గుంతలును పూడ్చాలని అధికారులును శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు.

## కాపు సంక్షేమ సేవ ఆధ్వర్యంలో ప్రేమాలయంలో అన్నదానం

రామాపురం ఆగస్టు 9, ప్రభాతవార్త



హరి రామ జోగయ్య ఆధ్వ ర్యంలో కాపు సంక్షేమ సేన మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంద ర్భంగా బుధవారం ప్రేమాలయం నందు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అన్నమయ్య జిల్లా కాపు సంక్షేమ సేన అధ్యక్షురాలు రెడ్డి రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రేమాలయంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం చాలా సంతోష దాయకం అన్నారు. హరి రామ జోగయ్యను స్ఫూర్తిగా తీసుకొని ఆయన వేసిన బాటలో నడుస్తూ కాపు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఆమె తెలిపారు కాపులకు చేస్తున్న సేవలు ఎప్పటికీ మరవకూడదని,కొందరు కాపులు వారి రాజకీయ భవిష్యత్తు కోసం లబ్ధి పొందడానికి కాపులను చిన్న చూపు చూడడం తగదు అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు బుడ్డా బాబు, కాపు యువసేన ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, కాపు సంక్షేమ సేన నాయకులు పాల్గొన్నారు.

## అనాధ వృద్ధులకు అన్నదానం

బద్వేలు అర్బన్, ఆగస్టు 9 ప్రభాతవార్త :



బద్వేల్ పట్టణంలోని తెలుగు గంగ కాలనీలోనీ ఆ నంద నిలయం నిరాశ్రయుల వసతి గృహంలోని అనాధ వృద్దులకు బుధవారం రాజా కన్నయ్య ఐదవ వర్ధం తి పురస్కరించుకొని వారి అల్లుడు ఆర్యవైశ్య వర్తక సంగం కమిటీ మెంబర్ మెంట ప్రసాద్ వీరి సతీమణి విజయలక్ష్మి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అనాధ వృద్దులకు అన్నదానం మరియు పండ్లు తినుబండారాలను వారి చేతుల మీదుగా వితరణ చేశారు అనంతరం మెంటా ప్రసాద్ మాట్లాడుతూ అనేక రకాలుగా ఆసరా కోల్పోయి ఆశ్రమాన్ని ఆశ్రయించిన అనాధ వృద్దుల ను ప్రతి ఒక్కరు దయా హృదయంతో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు వృద్దుల బాగోగులు చూసుకుంటున్నటువంటి ఆశ్రమ నిర్వా హకు లు పిడటల రవికుమార్ సేవలను వారు అభినందించారు ఈ కార్యక్రమంలో మెంట సురేష్ బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వైసీపి ఎమ్మెల్యేలు కెసికెనాల్ హక్కుల కోసం పోరాడండి

### ములపాకు ప్రతాప్‌రెడ్డి

ప్రొద్దుటూరు ఆగస్టు 9, ప్రభాతవార్త

ప్రస్తుతం శ్రీశైలం డ్యామ్ లో 862 అడుగులు నీటిమట్టం ఉన్న, కేసీ కెనాల్ కు నికర జలాలు కేటాయించి ఉన్న రాయలసీమకు చెందిన కెసి కెనాల్ కి నీళ్లు ఇంకా విడుదల చేయలేదని, తెలంగాణ ప్రభుత్వం విద్యుత్తు ఉత్పత్తి పేరుతో నాగార్జునసాగర్‌కి నీటి విడుదల చేస్తూ ఉన్నదని,ఎప్పటికప్పుడు తెలంగాణ ప్రభుత్వం కిందకు నీళ్లు విడుదల చేస్తూ పోతే, రాయలసీమ ఎడారిగా మిగిలిపోక తప్పదని, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ,జోక్యం చేసుకొని, కేసి కెనాల్ కి నికరజలాలు ఉన్నటువంటి శ్రీశైలం డ్యాం నుంచి నీరు విడుదల చేయాలని తెలివి లేకుండా, వైసిపి ప్రభుత్వం తెలంగాణ వారు, పవర్ జనరేషన్ పేరుతో సాగర్ కి నీళ్లు విడుదల చేస్తున్న కూడా పట్టించుకోవడంలేదని, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమకు అనుకూలమా కాదా అనే విషయం తెలియ చెప్పాలని ప్రతాప్ రెడ్డి అడిగారు. శ్రీశైలం డ్యాం నుంచి నాగార్జునసాగర్ కి నీళ్లు పోతే ఆంధ్ర, తెలంగాణకి అనుకూలమని, రాయలసీమ కోసం ఎవరు ప్రయత్నం చేస్తారో చెప్పండి అని ములపాకు ప్రతాప్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

## ఓటర్ల సర్వే సక్రమంగా నిర్వహించాలి



దువ్వూరు, ఆగస్టు 9, ప్రభాతవార్త:

మండల పరిధిలో ఓటర్ల జాబితా పరిశీలనా, సర్వే కార్యక్రమాలు జరుగుతున్నాయని వీటిని సక్రమంగా నిర్వహించాలని దువ్వూరు, మైదుకూరు తహసీల్దార్లు రమాకుమారీ, అనురాధలు అన్నారు. బుధవారం ఓటర్ల సర్వేపై బీఎల్ఓలకు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. అలాగే మరణించిన వారుంటే వారి పేర్లు తొలగించాలన్నారు. సర్వేని నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గరాదన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ బాబాఫకృద్దీన్, వీఆర్వోలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



చిన్నమండెం, ఆగస్టు 09ప్రభాతవార్త:

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపుల భిస్తుందని ప్రధానోపాధ్యాయిని పద్మజ అన్నారు. చిన్నమండెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయిని పద మ్మజ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు చేసిన కృషి ఎనలేనిదన్నారు.కార్యక్ర మంలో పాఠ్యపుస్తక రచయిత మడితాటి నరసింహారెడ్డి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మెన్ జాఫర్ వలి, ఉపాధ్యాయులు, విద్యార్థిని

## ఘనంగా ఆదివాసి దినోత్సవం వేడుకలు



పీలేరు, ఆగస్టు 9 ప్రభాతవార్తః

స్థానిక పట్టణంలో ప్రపంచ ఆదివాసి దినోత్స వం ఆంధ్రప్రదేశ్ గిరిజన యనాది సేవా సంఘం , ఆర్‌జీఎస్ సంయుక్త ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. స్థానిక కోటపల్లె వివేకానంద విగ్రహ కూడలి నుంచి గిరిజనులు విద్యార్తులచే స్థానిక నాలుగు రోడ్లు కూడలి, ఆర్టీసీ బస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు. నాలుగురోడ్లు కూడలిలో మానవహారంగా నిలబడి గిరిజనుల ఐక్యతను ప్రదర్శించారు. అంబేద్కర్ కూడలి నందు సమావేశం నిర్వహించారు. ర్యాలీ ఆద్యాంతం డప్పుల దరువులతో గిరిజన మహిళల నత్యాలతో గిరిజనుల ఐక్యత వర్ధిల్లాలి , ఆదివాసి జై జై ఆదివాసి వంటి నినాదాలతో పట్టణం మారు మ్రోగిందన్నారు. కూడలిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితిలో తీర్మాణం మేరకు 1994వ సంవ్సరం నుంచి ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఏడాది ఆదివాసి దినోత్స వం జరుగుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి76 సంవత్సరాలు పూర్తి అయినప్పటికి కేం ద్ర ప్రభుత్వం ఆజాదీకా అమత్ మహోత్స వం అంటూ ఆడంబరంగా ఉత్స వాలు జరుపుతున్నప్పటికి గిరిజనులకు ఇళ్లు కూడా అడవుల్లో చెట్ల కింద తలదాచుకుని పరిస్థితి ఉంది, సిగ్గుతో తలవంచుకోవాలని అన్నారు. గిరిజనుల హక్కులు సాధించుకోవాలంటే గిరిజనులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్య క్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవాసంఘం గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి, రాష్ట్ర గిరిజన సమైక్య పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు కిల్లా విజయ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ కాలనీ చిన్న, ఆవుల కాటయ్య, శ్రీనివాసులు, రెడ్డెప్ప, ఈశ్వరయ్య, రమణ, ఆదినారాయణ, రాజేష్, బాబు రమేష్, గిరిజన యానాదిమహిళ నాయకురాలు నారాయణమ్మ మల్లీశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణకు కృషిచేయాలి

వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త :



నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని వేంపల్లె మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథరెడ్డి సూచించారు. బుధవారం వేంపల్లె ఎంపీడీవో కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్స వానికి సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథరెడ్డ మాట్లాడుతూ చెప్పులు లేకుండా నడవడం, మట్టిలో ఆడడం, చాక్‌పీసులు, బలపాలు, మట్టిని తినడం వల్ల శరీరంలో నులిపురుగులు తయారవుతాయని తెలిపారు. ఈ పురుగులు పేగుల్లో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయని, దీని కారణంగా పిల్లలు భుజించిన ఆహారం శరీరానికి పట్టకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఆల్బెండజల్ మాత్రలు వేయడం ద్వారా నులిపురుగులు లేకుండా చేయాలనే లక్ష్యంతో కేంద్ర ఆరోగ్యశాఖ విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరెడ్డి, డాక్టర్ స్వాతిసాయి, ఎంఈవో బండి వీరారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటరు షఫివున్నీసా బేగం, తదితరులు పాల్గొన్నారు.

## గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి

దువ్వూరు, ఆగస్టు 9, ప్రభాతవార్త:



మండల పరిధిలోని గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వల్లీ అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ కేంద్రం నందు ప్రధాన మంత్రి మాతృత్వ యోజన కింద గర్భవతులకు పరీక్షలు ఎనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత రాదన్నారు. గర్భవతులు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలలా చూసుకోవాలన్నారు. అనంతరం నా తల్లి, నాదేశంలో భాగంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇందులో భాగంగా చెట్లను నాటారు. అలాగే చింతకుంట వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో మిషన్ ఇంద్రదనుస్సు కార్యక్రమం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సురేష్‌బాబు, రోహిణి, వైద్యసిబ్బంది విజయకుమారి, మురళీదరన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల సమ్మెను విరమించాలి



వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల జేఏసీతో చర్చించి సమ్మెను విరమించాలని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం అర్ధ రాత్రి నుండి విద్యుత్ ఉద్యోగులు నిర్వహించనున్న నిరవధిక సమ్మె వల్ల అన్ని రంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీతోఫా విషయంలో వివిధ మతాలు, కులాల మధ్య జగన్ ప్రభుత్వం వివక్ష చూపడం సమంజసం కాదని తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీ, క్రిష్టియన్ మైనార్టీ చెల్లెమ్మలకు రూ.లక్ష ఆర్థిక సహాయం ఉండగా, బీసీ చెల్లెమ్మలకు రూ.50వేలు మాత్రమే ఇవ్వడం వివక్ష అన్నారు. అనేక అగ్రవర్ణ కుటుంబాలకు కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తూ ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయలేక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి వైఎస్ఆర్ కల్యాణమస్తు వర్తించడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీతో పాటు బీసీ, పేద అగ్రవర్ణ చెల్లెమ్మలకు కూడా రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

## గర్భిణులకు మానవత వితరణ

పులివెందుల రూరల్, ఆగస్టు 9, ప్రభాతవార్త :



పులివెందులలోని మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. మానవత సంస్థ అధ్యక్షుడు సుబ్బరాయుడు తన కుమారుడు వెంకట రాజేష్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు ఈ వితరణ గావించారు. ఆసుపత్రి వైద్యాధికారిణి లక్ష్మిప్రియ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుండి పరీక్షల కోసం విచ్చేసిన గర్భిణులకు బ్రెడ్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ కొండారెడ్డి, అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి హరిశ్చంద్రారెడ్డి, సభ్యులు సదాశివారెడ్డి, నాగేశ్వరరెడ్డి, పి.వి.భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అశ్వర్థ నారాయణరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ఏపీ కనీస వేతనాల అడ్వైజరీ బోర్డు ఛైర్మన్

కొండాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త :



ఏపీ కనీస వేతనాల అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ ఒంటెద్దు రఘునాథరెడ్డి బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తాడేపల్లెలోని ముఖ్యమంత్రి నివాసంలో ఉన్న సీఎంను రఘునాథరెడ్డి కలిసి మాట్లాడారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనకు కనీస వేతనాల అడ్వైజరీ బోర్డు ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాస్థాయి ఆటల పోటీలలో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

సంబేపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్తః



రాయచోటి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో దివ్యాంగుల విద్యార్థుల కోసం నిర్వహించిన ఆటల పోటీలలో సంబేపల్లి హై స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని దివ్యాంగుల విద్యార్థుల ప్రత్యేక ఉపాధ్యాయిని రాచూరి సుజాత ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి తెలిపారు. సంబేపల్లి హైస్కూల్ నందు బుధవారం జిల్లా స్థాయి ఆటల పోటీలలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమొంటో మెడల్స్ ను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఉపాధ్యాయిని రాచూరి సుజాత మాట్లాడుతూ పాఠశాలకు చెందిన దివ్యాంగుల విద్యార్థులు జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలలో ప్రతిభ చూపడం ఆనందంగా ఉందన్నారు. వారిలో సీనియర్ విభాగంలో పాల గణేష్ ప్రథమ స్థానం, ధనయ్య ద్వితీయ స్థానం, జూనియర్ విభాగంలో రాజకుమార్ ద్వితీయ స్థానం, త్రో బాల్ నందు సీనియర్ విభాగంలో పాల గణేష్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. పాఠశాలలోని దివ్యాంగుల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నామన్నారు. ఇతర విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని విధంగా చదువు నందు, క్రీడల నందు ప్రత్యేక తర్ఫీదును ఇచ్చి వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సంకల్పం ఉంటే ఏమైనా సాధించవచ్చు

గాలివీడు, ఆగస్టు 9 ప్రభాతవార్తః



సంకల్పం ఉంటే ఏమైనా సాధించవచ్చు అని విద్యార్థులు నిరూపించారని ప్రధానోపాధ్యాయుడు దుర్గేష్ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుదవారం విలేఖర్లతో మాట్లాడుతూ మండల కేంద్రం లోని బాలికల ఉన్నత పాఠశాలలో లోని విద్యార్థులు జిల్లాలో జరిగిన ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఆటల పోటీల్లో మొదటి రెండవ తృతీయ బహుమతులు మన మండలానికి చెందిన మన పాఠశాలకు చెందిన వారు కావడం గర్వకారణం అన్నారు మొదటి వరుసలో గాయత్రి రెడ్డమ్మ లావణ్య లు జిల్లాలోనే మొదటి రెండవ మూడవ బహుమతులు పొందడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులు వారిని అభినందించారు అన్నారు. వీరు ఇటు చదువులోనూ ఆటల్లోనూ రాణించాలన్నారు. ముఖ్యంగా చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ర్యాంకులు సాధించవచ్చు అన్నారు. కార్యక్రమంలో పిడి వాణిశ్రీ ఉపాధ్యాయులు వై .యన్. నారాయణమ్మ పాల్గొన్నారు.

## గృహ లబ్ధిదారులతో రూ.35వేలు కట్టించండి

పులివెందుల, ఆగస్టు 9, ప్రభాతవార్త :



పులివెందులలో జగనన్న గృహనిర్మాణ పథకం కింద జగనన్న కాలనీకి అర్హులైన లబ్ధిదారుల నుండి సచివాలయం వారిగా రూ.35వేలు నగదు కట్టని వారిని గుర్తించి వారిచేత నగదు కట్టించేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి తెలిపారు. పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సర్టిఫికెట్‌లు పొంది వాటి ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన వారిని గుర్తించాలన్నారు. ముఖ్యంగా జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్లు పొంది ఇంకా రూ.35వేలు కట్టని లబ్ధిదారులను గుర్తించి వెంటనే వారి చేత కట్టించాలని తెలిపారు. ఈ సమావేశంలో అడ్మిన్, వెల్ఫేర్, సచివాలయ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# అంధకారంలో కాశినాయన

### గ్రామీణ ప్రాంతాల్లో గంటల కొద్ది విద్యుత్ కోతలు

కాశినాయన, ఆగస్టు 09ప్రభాతవార్త:

మండలంలోని గ్రామీణ ప్రాంతాలు గంటల తరబడి విద్యుత్ కోతలు నెలకొన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఎందుకు ఏర్పడుతుందని స్థానిక ప్రజలు అధికారులను ప్రశ్నిస్తుండగా పై నుంచి విద్యుత్ పోయిందని ఇప్పుడే చెప్పలేమని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ అధికారులకు కూడా తెలియని విద్యుత్ అంతరాయం. ఇప్పటికే పెరిగిన విద్యుత్ ఛార్జీలతో ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర అసహనంగా ఉన్నారు. మరి ఇలా విద్యుత్ అప్రకటిత విద్యుత్ కోతలు విద్యుత్ ఉండడంపై గ్రామీణ, మండల కేంద్రాల ప్రాంతాలలో అధికార వైసిపి పార్టీ మరింత వ్యతిరేకత ఇచ్చే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. కాశినాయన మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో గంటల తరబడి అప్రకటిత విద్యుత్ కోతలతో గత రెండురోజులుగా మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని సిపిఐ మండల కార్యదర్శి ఎదురు సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలతో సతమతమవుతున్న ప్రజలు విద్యుత్ కోతలతో ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రభుత్వానికి, విద్యుత్ ఉద్యోగులకు సరికాదన్నారు. ఏదైనా కోతల సమయంలో ముందస్తు సమాచారం ప్రజలకు తెలియజేయవలసిన కనీస బాధ్యతను మరచిన విద్యుత్ ఉద్యోగులు ఇప్పటికైనా బాధ్యతతో మెలగకపోతే ప్రజలతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. మంగళవారం, బుధవారం 7.30 గంటల సమయంలో పోయిన కరెంట్ 10.30 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడిందనా న్నరు. ప్రభుత్వ అధికారులకు కూడా తెలియని విద్యుత్ అంతరాయంపైన ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## మేరీ మట్టి... మేరా దేశను విజయంతం చేయండి

### ఉద్యానశాఖ డీన్ డాక్టర్ రూత్



రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అనంతరాజుపేట పంచాయతీ ఉద్యాన హార్టికల్చర్ యూనివర్శిటీలో ఉద్యాన అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్ ఆధ్వర్యంలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే ప్రత్యేక కార్యక్రమాన్ని మండలంలోని కెఆర్ కండ్రికలో సర్పంచ్ చియ్యవరం విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని ఉద్యాన కళాశాల వారు తీసుకున్న దత్తత గ్రామమైన కెఆర్ కండ్రికలో ప్రధానమంత్రి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో మొక్కలు నాటి భారత సైన్యంలో సేవలను అందించిన సైనికులు క్రిష్ణారెడ్డి, ఎం.ప్రవీన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు అందరూ ప్రతిజ్ఞను ఘనంగా పాటిస్తూ జాతీయ గీతాలాపన నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ రూత్, చియ్యవరం సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్‌కమిటి ఛైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు, అడ్వైజర్ బోర్డు ఛైర్మన్ విశ్వేశ్వర్‌రాజు, శాస్త్రవేత్త డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫిసర్‌లు డాక్టర్ వై.దీప్తికిరణ్, డాక్టర్ ఎ.నిశ్చల, ఉద్యాన కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రూత్ దేశ సేవకు ఉపయోగపడిన సైనికులను ఘనంగా పూలమాలలతో సన్మానించారు.

## జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జీగా జస్టిస్ కె.సురేష్‌రెడ్డి

కడప లీగల్, ఆగస్టు 9, ప్రభాతవార్త:

కడప జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జీగా జస్టిస్ కె.సురేష్‌రెడ్డిని నియమిస్తూ హైకోర్టు రీస్ట్రాట్ జనరల్ వై.లక్ష్మణరావు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కోర్టులకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ జడ్జీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా జడ్జీ కె.సురేష్‌రెడ్డిని కడప జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన అడ్మినిస్ట్రేటివ్ జడ్జీగా కడప జిల్లా కోర్టుకు పని చేయనున్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు

లక్కిరెడ్డిపల్లి, ఆగస్టు 9, ప్రభాతవార్త :



విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉద్యోగ భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివ శంకర్ రెడ్డి పేర్కొన్నారు బుధవారం స్థానిక మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ ఫ్రొసెస్ డే నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 తర్వాత ఇంటర్లో భవిష్యత్తును ఎంచుకోవచ్చు అని ఏ గ్రూపు తీసుకున్న ఆ గ్రూపుకు నిమగ్నమై అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చున్నారు ఇంజనీరింగ్ డాక్టర్ ఐపీఎస్ ఐఏఎస్ వివిధ రంగాలలో ప్రవేశించడానికి ముందుగానే ఓ నిర్ణయం ప్రకారం చదివితే గమ్యాన్ని చేరుకోవచ్చు అన్నారు. విద్యార్థులు ఇంటర్మీడియట్ లో వ్యసనాలకు బానిస కాకుండా చెడు అలవాట్లకు దూరంగా కాలేజీకి సక్రమంగా వచ్చి చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు అన్నారు ఈ ఏడాది ఒంటరిలో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ అధ్యాపకులు శ్రీకళ సుజాతమ్మ నాగయ్య శ్రీనివాసులు విజయకుమారి విజయ ఉపాధ్యాయులు మురళి నాయక్ భారతి ప్రసాద్ రాజేశ్వరి అరుణకుమారి పిడి సోమశేఖర్ నాయక్ సుధీర్ కుమార్ ఉమామహేశ్వరి చక్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన గడ్డను.. దేశాన్ని విస్మరించకూడదు

### నా భూమి - నా దేశంలో ప్రతిజ్ఞ



రాజంపేట అర్బన్, ఆగస్టు 9 ప్రభాతవార్త

పుట్టిన గడ్డను, దేశాన్ని ప్రజలు విస్మరించరాదని, ఒకవేళ అలా చేస్తే అంతకంటే ఘోరమైన ఘోరం ఇంకొకటి ఉండదని ప్రజాప్రతినిధులు, మేధావులు, విద్యార్థులు పేర్కొన్నారు. నా భూమి - నా దేశం అంటూ ప్రధాని మోడి ఇచ్చిన పిలుపు మేరకు అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం వందలాదిమంది విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. మేము సైతం అంటూ పుట్టిన గడ్డను మరువమని, దేశం కోసం తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపును ఎన్‌టిఆర్ కాలనిలో నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. మందరం గ్రామంలో అమరవీరులు వి.రవిచంద్రారెడ్డి, వి.వెంకటరెడ్డిల స్థూపం వద్ద స్థానిక ప్రజాప్రతినిధులు తంబెల వేణుగోపాల్‌రెడ్డి యువకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాల్లో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తం, ఎన్‌సిసి అధికారి మేజర్ విజయభాస్కర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి, కె.వెంకటనరసయ్యలు పాల్గొన్నారు.

## నెలాఖరులోగా బస్టాండు నిర్మాణాలను పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి, ఆగస్టు 9 ప్రభాతవార్తః



రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ విస్తరణలో భాగంగా చేపట్టిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. రూ 2.50 కోట్ల నిధులతో చేపట్టిన రాయచోటి బస్ స్టాండ్ నిర్మాణపు పనులను మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాష, ఆర్ టి సి ఆర్ ఎం రాము, ఈఈ వెంకట రమణ,డి ఎం ధనంజయ, ఆర్ టి సి ఎలక్ట్రికల్ డిఈ వన్నూరు సాహెబ్ లతో కలసి శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. డైట్ కు ,బస్టాండ్ మధ్యలో ఉన్న నూతనంగాప్రహరీ గోడ ను నిర్మించాలని ,ముఖ ద్వారంలో ఇన్ గేట్, ఔట్ గేట్ ల వద్ద లైటింగ్ నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఒపెన్ యూరినల్స్‌కు చర్యలు తీసుకోవాని అధికారులుకు ,కాంట్రాక్టర్ కె పి ఆర్ కన్ స్ట్రక్షన్ కు సూచించారు. పనులు పూర్తయిన సిసి రోడ్డు నిర్మాణాలును పరిశీలించారు. టాయిలెట్ల నిర్మాణాలను పరిశీలించారు.పాత బస్ స్టాండ్ కు కూడా రంగులు వేయాలని, మరమ్మత్తులు చేపట్టాలని శ్రీకాంత్ రెడ్డి సూచించారు. బైక్ స్టాండ్ ఏర్పాటు చేయాలని శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, జెడ్ పి టిసి మాసన వెంకట రమన, కె పి ఆర్ కన్ స్ట్రక్షన్ కనపర్తి చెన్నారెడ్డి,ఆసీఫ్ అలీఖాన్,ఫయాజ్ అహమ్మద్,గౌస్ ఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సాదక్ అలీ,జానం రవీంద్ర యాదవ్, రియాజ్,సుగవాసి శ్యామ్, రామాపురం వైస్ ఎంపిపి రవిశంకర్ రెడ్డి, సూరం వెంకట సుబ్బారెడ్డి, మురళీ ధర్ రెడ్డి, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, కో ఆప్షన్ సభ్యులు అయ్యవారు రెడ్డి, హజరత్ ఖాదర్ వలీ, ముదిరాజ్ యువసేన జిల్లా అధ్యక్షుడు విక్కీ దేవేంద్ర,జావీద్,అమీర్ పాల్గొన్నారు.

## అంగళ్లు, తంబళ్లపల్లె, పుంగనూరు ఘటనలకు వైసిపి వారే బాధ్యులు

### మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆరోపణ

రాయచోటి టౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్తః

దాడులు చేసిన వైసిపి గూండాలను వదిలేసి... తమ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మరియు నాపై మరియుకార్యకర్తలు, నాయకులుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దారుణం దారుణమని మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు బుధవారం ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. వైసిపి నేతల ఒత్తిడితోనే తమ పై అక్రమ పోలీసు కేసులు బనాయించారని ఆరోపించారు. అంగళ్లు, తంబళ్లపల్లె, పుంగనూరు ఘటనల్లో చోటు చేసుకున్న సంఘటనలకు వైసిపి వారే బాధ్యులని వారిని వదిలేసి టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై తన పై తమ పార్టీ నేతలు, కార్యకర్తల పై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించడం దారుణమని, వైసిపి నేతల బత్తిడి మేరకే పోలీసులు తమ పై అక్రమ కేసులు బనాయించారంటూ ఆరోపించారు ఈనెల 4వ తేదీన అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని తంబళ్లపల్లె, అంగళ్లు, పుంగనూరు ప్రాంతాల్లోని ప్రాజెక్టుల ను పరిశీలించేందుకు వచ్చిన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి లు కలిసి అధికార దర్పంతో పోలీసులను అడ్డుపెట్టుకొని వైసిపి గూండాలతో పోలీసుల సమక్షంలోనే ఎందరో టిడిపి కార్యకర్తలు, నాయకుల పై మారణాయుధాలతో దాడులు చేయించి విధ్వంసం సృష్టించారంటూ ఆయన ఆరోపించారు. నిందితులను వదిలేసి వైసిపి గూండాల చేతిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైన టిడిపి కార్యకర్తలు, నాయకులు పైనే అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు.

## విద్యాకానుక పంపిణీలో జాప్యం!

నందలూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త

మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 2 రెసిడెన్షియల్ పాఠశాలలు, సుమారు 45 మండల పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థిని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పాఠశాల ప్రారంభం అయిన రోజే ఇవ్వాలని భారీగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 3 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అరకొర జగనన్న విద్యాకానుక ఇవ్వడం జరిగింది. వీటి పంపిణీలో మండల విద్యాశాఖ లోపమా? లేక ప్రచారానికి పరిమితం అవుతున్న ప్రభుత్వం లోపమా? అర్థం కాని పరిస్థితి ఉంది. పాఠశాల ప్రారంభమయ్యే ముందు ప్రభుత్వం నుండి వచ్చినటువంటి విద్యాకానుక కిట్లను పరిశీలించి పాఠశాలలకు పంపించే బాధ్యత ఎంఇఒ కార్యాలయం పని, వచ్చినట్లు కిట్లను పరిశీలించి పాఠశాలలో ఉండే విద్యార్థులకు వచ్చినట్లు సరిగా ఉన్నాయా లేదా అని తీసుకోవాలి స్న బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులది వీరిద్దరి మధ్య కొరవడిన సమాచార లోపం వల్ల పాఠశాలలో ఉన్నటువంటి విద్యార్థులకు అందాల్సిన విద్యాకానుక అందడం లేదనేది తల్లిదండ్రుల ఆవేదన. దీనిపై మండల విద్యాకానుక అందంలేదనేది తల్లిండ్రుల ఆవేదన. దీనిపై మండల విద్యాశాఖ అధికారి నాగన్నని వివరణ కోరగా గత సంవత్సరం చదువుతన్నటువంటి విద్యార్థులకు విద్యాకానుక రెగ్యులర్‌గా అందుతుందని ప్రస్తుతం కొత్తగా వచ్చిన పిల్లలకు విద్యాకానుక అందడంలో కాస్త జాప్యం జరగుతున్నమాట వాస్తవమేనని పూర్తి వివరాలను మా పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని త్వరలోనే ఎక్కడైతే ఈ విద్యాకానుక సరిగా అందలేదు వారికి పూర్తిగా అందేలా చూస్తామని ఆయన వివరణ ఇచ్చారు.

## ఓటర్ల వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయండి

### మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి

రాయచోటి, ఆగస్టు 9, ప్రభాతవార్త :



రాయచోటి నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఓటర్ల వెరిఫికేషన్ ను త్వరగా పూర్తి చేయడమే కాకుండా ఎక్కడైనా దొంగ ఓట్లు ఉంటే గుర్తించి వాటిపై సంబంధిత అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి,మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి సూచించారు. .బుధవారం రాయచోటి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల టిడిపి అధ్యక్షులు,క్లస్టర్ ఇంచార్జ్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దొంగ ఓట్లు ఎక్కువయ్యాయని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని మండలాల్లో ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగానే తెలుగుదేశం పార్టీ తరపున ఆయా మండలాల అధ్యక్షు లు,క్లస్టర్ ఇంచార్జ్ లు ఓటర్ల వెరిఫికేషన్ త్వరగా పూర్తి చెయ్యాలని, ఎక్కడైనా దొంగ ఓట్లు గుర్తించే ఉంటే వాటిని గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు శివారెడ్డి,టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ భాషపట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలి,గాలివీడు క్లస్టర్ ఇంచార్జ్ లు వెంకటశివారెడ్డి, సత్యారెడ్డి,సంబేపల్లి మండల టిడిపి అధ్యక్షులు చిన్న రెడ్డెయ్య యాదవ్,రామాపురం క్లస్టర్ ఇన్చార్జి చింతపిచ్చల రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వన్‌వే, నోఎంట్రీ వాహనాలపై స్పెషల్ డ్రైవ్

రాయచోటి, ఆగస్టు 9 ప్రభాతవార్తః



రాయచోటి పట్టణంలో వాహనదారులు వన్ వే మరియు నో ఎంట్రీ మార్గాలలో వెళ్లే వాహనాల పై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ రఫీ తెలిపారు హాస్పిటల్స్ సముదాయము బస్టాండ్ దగ్గర గాలివీడు టర్నింగ్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల రికార్డులను పరిశీలించారు వాహనదారులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ చేసి మరల పునరావతం చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి జరిమానాలు విధించినట్లు ఎస్సై తెలిపారు.